తాగునీటి ఎద్దడిని నివారిస్తాం

- రూ. 8.45 కోట్లతో ప్రతిపాదనలు
- ఒడిఎఫ్ ప్లస్ గ్రామాలుగా మార్చేలా చర్యలు
- జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం
- ప్రజాశక్తితో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సిహెచ్ మనోహర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'కర్నూలు జిల్లాలో వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాం. 141 గ్రామీణ ఆవాస ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేలా రూ 8.45 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. జిల్లాలో అన్ని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జల్‌జీవన్ మిషన్ కింద జరుగుతున్న పనులు మరింత వేగవంతంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తున్నాం.' అని జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా కార్యనిర్వాహక ఇంజనీర్(ఎస్ ఇ) సిహెచ్ మనోహర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

కర్నూలు జిల్లాలో రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఇ: తాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారుల నుండి నివేదికలు తీసుకున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 33 సిపిడబ్ల్యు లకు నీటిని నింపాం. ఇప్పటికే ఎక్కడెక్కడ తాగునీటి సమస్య నెలకొంటుందో అక్కడ బోర్ల రిపేరు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వంటి పనులను చేపట్టేందుకుగాను రూ 8.45 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. ఏ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలు తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద ఎన్ని పనులను చేపట్టారు? ఆ పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

ఎస్ఇ: జిల్లాలో జల్ జీవన్ మిషన్ మొదటి విడత కింద దాదాపుగా1491 పనులు మంజూరు కాగా అందులో కేవలం1065 పనులకు మాత్రమే ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయి. ఇందులో దాదాపుగా 92 పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.73.42 కోట్లతో పనులను చేపట్టాం. ఇప్పటివరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. త్వరలోనే జల్‌జీవన్ మిషన్ కింద చేసిన పనులకు బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

శాశ్వతంగా తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఇ: జిల్లాలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి నాలుగు రిజర్వాయర్ల ద్వారా నీటిని తీసుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికను రూపొందించాం. రూ.2425 కోట్లతో ఈ పనులను చేపట్టేందుకు గాను ఉన్నతాధికారులకు నివేదించాం. జల్‌జీవన్ మిషన్ 2 కింద ఈ పనులను చేపట్టేలా చర్యలు తీసుకున్నాం.

జ్రిల్లాలో ఒడిఎఫ్ గ్రామాలుగా మార్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఇ: కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలను ఒడిఎఫ్ ప్లస్ గ్రామాలుగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకున్నందుకు రూ.పన్నెండు వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఎక్కువగా ఐహెచ్ఎల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాం. గ్రామాల్లో ప్రజలకు బహిరంగమల విసర్జన ద్వారా వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఫ్యాకల్టీ లేకుండా బోధన ఎలా..?

- ఫుడ్ టెక్నాలజీ న్యూట్రిషన్ కోర్సు విస్మరణ
- కోర్సుకు టీచింగ్ ఫ్యాకల్టీ దిక్కేది..
- ఇతర కోర్సులకు చెందిన ఫ్యాకల్టీతోనే బోధన
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని విశ్వవిద్యాలయ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్స్ కింద కొత్తగా ఎంఎస్‌సి ఫుడ్ టెక్నాలజీ అండ్ న్యూట్రిషన్ కోర్సును ప్రవేశపెట్టారు. ఈ కోర్సును ప్రవేశపెట్టే సమయంలో ఫ్యాకల్టీని నియమించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు చెప్పటంలో విశ్వవిద్యాలయ అధికారులు వైఫల్యం చెందారు. ఈ కోర్సులో చేరినటువంటి విద్యార్థులకు బోధన చేసేందుకు ఫ్యాకల్టీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇటీవల కాలంలో కొత్త పీజీ కోర్సులను విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు ప్రవేశపెట్టారు. అందులో పీజీ కోర్సు విభాగంలో ఎంఎస్‌సి ఫుడ్ టెక్నాలజీ అండ్ న్యూట్రిషన్ కోర్సు ప్రవేశపెట్టారు. ఈ కోర్సులో దాదాపుగా మన జిల్లా విద్యార్థులే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా అడ్మిషన్ పొందారు. ఈ కోర్సులో 18 మందికి పైగా అడ్మిషన్ పొందారు. ఈ కోర్సును బోధించేందుకుగాను సరైనటువంటి టీచింగ్ ఫ్యాకల్టీ ఇప్పటివరకు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు నియమించలేదు. ఈ కోర్సును ప్రస్తుతం బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ఫ్యాకల్టీతో బోధన చేయిస్తున్నారు. అసలు ఈ కోర్సుకు సంబంధం లేనటువంటి ఫ్యాకల్టీతో బోధన చేస్తే విద్యార్థులు సబ్జెక్టును నేర్చుకోవడం కష్ట సాధ్యమవుతుంది. ఈ కోర్సుకు చెందిన ఫ్యాకల్టీ తోనే బోధన చేస్తేనే విద్యార్థులు సబ్జెక్టును సులువుగా అర్థం చేసుకుంటారు. ప్రస్తుతం బోధన చేస్తున్న ఫ్యాకల్టీ కూడా ఎక్కువసేపు కూడా చెప్పలేక కేవలం 15 నుండి 20 నిమిషాల్లోనే పాఠ్యాంశాలను ముగించేస్తున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. కొత్తగా ప్రవేశపెట్టే సమయంలో తప్పనిసరిగా సబ్జెక్టు బోధించే ఫ్యాకల్టీని నియమించిన తర్వాతనే ప్రవేశ పెట్టాల్సి ఉందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. వెంటనే ఈ కోర్సును బోధించేందుకు టీచింగ్ ఫ్యాకల్టీ నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఫ్యాకల్టీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు

కొత్త కోర్సులను ప్రవేశపెట్టే సమయంలో తప్పనిసరిగా ఫ్యాకల్టీని నియమించుకోవాలి. ఫ్యాకల్టీ లేకుండా విద్యార్థులకు కోర్సుల ప్రవేశం కల్పించి ఇప్పుడు బోధన చేసేందుకు దిక్కెవరు లేరు. వెంటనే టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలి.

- రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి, రాయలసీమ విశ్వవిద్యాలయం.

కాంట్రాక్టు పద్ధతిలో ఫ్యాకల్టీ నియామకం

ఎంఎస్‌సి ఫుడ్ టెక్నాలజీ న్యూట్రిషన్ కోర్సులో విద్యార్థులకు బోధనలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే కాంట్రాక్టు పద్ధతిలో ఫ్యాకల్టీ నియామకానికి చర్యలు చేపడుతాం. విద్యార్థులకు విద్యాబోధనకు సిబ్బంది లేకుండా చేస్తాం.

- విజయ్ కుమార్ నాయుడు, రిజిస్ట్రార్, రాయలసీమ విశ్వవిద్యాలయం.

పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లు, పెన్షన్ పంపిణీ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్షన్లను డిసెంబర్ 31న పింఛనుదారులకు పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో భాగంగా ఐవిఆర్ఎస్ ద్వారా పెన్షన్ పంపిణీ పై పెన్షన్ దారుల నుండి అభిప్రాయ సేకరణ జరుగుతోందన్నారు. పెన్షన్ దారుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని కలెక్టర్ పెన్షన్ పంపిణీ అధికారులను ఆదేశించారు. ..టెలి కాన్ఫరెన్స్ లో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణా రెడ్డి, జడ్పీ సిఇఒ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు ప్రణాళిక కోసమే 'క్యాలెండర్'

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

క్యాలెండర్ అంటే పేజీలు తిరగవేయడం కాదని, గడిచిన కాలం బేరిజు వేసుకొని భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకోవడమేనని మెప్మా ఆర్‌పిల 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శృతి అన్నారు. మెప్మా ఆర్‌పిల సంఘం కార్యదర్శి ఉమాదేవి అధ్యక్షతన నూతన 2026 క్యాలెండర్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శృతి, సామాజిక ఉద్యమ కార్యకర్త అర్జ ఉష, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల కర్నూలు లక్ష్మీ నగర్ వికాస్ స్కూల్లో ఆదివారం అవిష్కరించారు. మేనేజర్ శృతి మాట్లాడుతూ క్యాలెండర్ అంటే తేదీలు చూసి పేజీలు చెప్పటం కాదు జరిగిన కాలంలో మనం ఏం చేశాం... ఏం చేయలేకపోయాం... భవిష్యత్తులో ఏం చేయాలి అని ప్రణాళిక వేసుకుని కృషి, ఫలితం వచ్చేదని అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కూడా అదే ఆర్‌పిల సంఘం క్యాలెండర్‌ను తీసుకురావడం అది కూడా ప్రయోజనకరంగా ఉండే విధంగా సావిత్రిబాయి పూలే, కెప్టెన్ లక్ష్మీషెగళ్, రాణిరుద్రమదేవి, ఝాన్సీలక్ష్మిబాయి, మదర్‌థెరిసా,మల్లు స్వరాజ్యం, కల్పనాచావ్లా, చాకలి ఐలమ్మ, ఇందిరా గాంధీ, సరోజినీ నాయుడు, మలాలా ,యూసఫ్ జాయ్ వంటి వీరవనితలు, దేశం కోసం, సమాజం కోసం కషి చేసిన వారు అలాంటివారిని గుర్తు తెచ్చుకుంటూ మనం ఉన్నంతలో మనకు కాకపోయినా మన తరాలకు అభివృద్ధి జరగాలని కోరుకోవాలన్నారు. ఈ క్యాలెండర్లో ప్రతి పేజీలో పొదుపులో ఉంటూ ఆర్థికంగా ఎదిగిన వారి వ్యాపారం ఫోటోలతో వేయటం బాగుందన్నారు. అలాగే ఐక్యత విజయం పోరాటం అనే నినాదాలు చాలా చక్కగా ఉన్నాయన్నారు. అందుకే మెప్మా ఆర్‌పిలను గౌరవిస్తానన్నారు. కారణం మెప్మా విధి విధానాలను పొదుపు గ్రూపులో సభ్యులు తీసుకెళ్లి వారిని ఆర్థిక సామాజిక సాధికారిక, అభివృద్ధి వైపు తీసుకెళ్లే ఆర్పీలు అంటే నేను చాలా గౌరవిస్తానని చెప్పారు. ఎవరికైనా సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యత సాధించుకోవాలి. అప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. సామాజిక ఉద్యమ నాయకురాలు అర్జఉష మాట్లాడుతూ ముందుచూపుతో ప్రణాళిక వేసుకుని ఆ ప్రణాళిక ప్రకారం ఆచరించటం అనుగుణంగా కార్యచరణ చేసుకుంటూ వెళ్ళటమే ముఖ్యం అంతేకాని, అప్పటికప్పుడు ఇది చేద్దాం అది చేద్దాం అని వెళ్తూ ఉంటే ప్రయోజనం ఉండదని మేనేజర్ శృతి చెప్పినట్లు మీరు అభివృద్ధి సాధించి చూపెట్టడమే మనం వేసుకునే ప్రణాళిక అన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ ఐక్యతే సమస్య పరిష్కారానికి మార్గమని ఆ మార్గంలో వెళ్తే ఏదైనా సాధించగలమన్నారు. పోలీసుల్లాగా లాటి, తుపాకులు మన చేతులలో లేవని, మనకుండేవి కాళ్లు చేతులే వాటి ద్వారానే ధైర్యాన్ని కూడ గట్టుకొని సమస్యలపై పోరాడి విజయం సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. సిఐటియు నగర నాయకులు రఫీ, మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.రుద్రమ్మ, సుజాత స్వాతి, బి. జ్యోతి ,ధరణి, కైరూన్, ఖాజాబీ, షహనాజ్ ,ధరణి శ్రీ దత్త ఆర్ పి సి .మంజుల అధ్యక్ష కార్యదర్శులు ఎం.వాణిశ్రీ, ఊర్మిళ ,సిరి ఐక్య సంఘం అధ్యక్షురాలు, కోశాధికారి వి..రాధిక ,కే .సరిత, చంద్రిక, రేష్మ, అయేషా ,భరతమాత ఆర్పి పద్మ, ఓబి వీరమ్మ, పావని, లక్ష్మీదేవి పెద్దలు భాను, ప్రసాద్, శ్రీనివాసులు, కన్నా తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శృతి తదితరులు

కన్నడ ఉపాధ్యాయులను నియమించాలి

- డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కన్నడ మీడియంలో బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి లు డిమాండ్ చేశారు. ఎల్లార్తి, ఇరుపాపురం హైస్కూలలో కన్నడ ఉపాధ్యాయులు లేరని వెంటనే అక్కడ ఉపాధ్యాయులను నియమించాలని డిఇఒ దృష్టికి తీసుకువచ్చారు. ఆదివారం డిఇఒ ఎల్.సుధాకర్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని పాఠశాలల్లో కన్నడ ఉపాధ్యాయులు ఉన్నారని, లేనటువంటి పాఠశాలల్లో ఉపాధ్యాయులను అక్కడికి నియమించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు దృష్టి సారించాలని డిఇఒ ను కోరారు. దీనిపై డిఇఒ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఆ రెండు పాఠశాలలో కన్నడ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డిఇఒ ఎల్.సుధాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు కె.సురేష్‌కుమార్, రవికుమార్, నవీన్‌పాటిలు

నేడు రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూఈనెల 29న సోమవారం ఉదయం 9 గంటలకు సుందరయ్య సర్కిల్ నుండి ప్రారంభమయ్యే రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతులో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.నరసింహులు మాట్లాడుతూ సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు డిసెంబరు 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయడం కోసం సిఐటియు వాడ వాడల జెండాలు ఎగరవేసి, వాల్ పోస్టర్లు ఆటో పోస్టర్లు, బైకు స్టిక్కర్లు, బ్యానర్లు కట్టి, గోడ రాతలు రాయించి శ్రామిక ఉత్సవ సభలు నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగా సోమవారం కార్మిక రెడ్ షర్ట్ కవాతులు నిర్వహించి జీపుజాతాలతో ప్రచారం చేస్తున్నామన్నామని తెలిపారు. జనవరి 4న విశాఖలో నిర్వహించే పెద్ద బహిరంగ సభ నిర్వహించి ఈ ప్రభుత్వాలకు హెచ్చరిక చేయడం కోసం కార్మికుల బలం ఏంటో కార్మికుల శక్తిని ఈ ప్రభుత్వాలకు తెలియజేసే విధంగా విశాఖపట్నంలో పెద్ద ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బండి వెనక బండి కట్టి 16 బండ్లు కట్టి పాట పాడిన చందంగా గ్రామలు పట్టణాల నుండి ఆటోలు, లారీలు, బస్సులు, జీపులు వంటి వాహనాల ద్వారా లక్షలాది మంది విశాఖపట్నం చేరుకోబోతున్నా రన్నారు. ఈమహాసభలను జయప్రదం చేయడం కోసం ఎర్రజెండా రెడ్ సైన్యం కవాతు చేస్తున్నారని, ఈ కవాతులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలాని బాష ఎగరవేశారు. అనంతరం కార్యాలయంలో మహాత్మా గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిలాని బాష, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబులు మాట్లాడుతూ దేశంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎస్‌సి. బజారన్న, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఒబిసి జిల్లా అధ్యక్షులు డివి సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

తరగతులు 5.. గదులు 3...

- గోరంట్ల ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరత..
- ఒకే గదిలో పలు తరగతుల విద్యాబోధన - అయోమయంలో విద్యార్థులు

గోరంట్లలోని ప్రభుత్వ పాఠశాల

ప్రజాశక్తి-కోడుమూరు

ప్రభుత్వ పాఠశాలల్లో గదుల కొరత వేధిస్తోంది. ఈ కొరత విద్యార్థుల చదువుని ప్రభావితం చేస్తోంది. మండల పరిధిలోని గోరంట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో (స్పెషల్) తగినంత తరగతి గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతిలో ఉండగా 90 మంది విద్యార్థులు, ఐదు మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంతమంది విద్యార్థులకు కేవలం మూడు తరగతి గదులు మాత్రమే ఉండడం, అందులోనే ప్రధానోపాధ్యాయుల గది ఇమిడి ఉండడంతో తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గదుల కొరత ... విద్యార్థుల వెతలు

సాధారణంగా ఒకే గదిలో ఎక్కువమంది విద్యార్థులు ఉండడం వలన ఉపాధ్యాయులు చెప్పే విషయాలపై విద్యార్థులకు ఏకాగ్రత లోపిస్తుంది. విద్యార్థులకు పఠనాసక్తి మందగిస్తుంది. ఈ సమస్య ప్రవేట్ పాఠశాలల వైపు విద్యార్థులు మళ్లింపునకు అవకాశం ఉంటుంది. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్షఅధికారులు త్వరలోనే మా పాఠశాలకు అదనపు గదులు నిర్మించుటకు అనుమతులు మంజూరు చేయాలని గోరంట్ల వాసులు కోరుతున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రస్తుతం ఉన్న స్కూలు ఆవరణంలో ఉన్న స్థలం తక్కువగా ఉన్నది. కాబట్టి స్కూల్ ఎదురుగా ఉన్న ఐదు సెంట్ల స్థలంలో నూతన నిర్మాణం చేపట్టి విద్యార్థుల సమస్యలు తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒకే గది బహుళ తరగతులు

పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉండడం వలన గదిలో కిక్కిరిసి కూర్చుంటారు. బోధన నాణ్యత పై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తుంది. ఒకే రూమ్ లో ఎక్కువ మంది విద్యార్థులు ఉండటం వలన ఉపాధ్యాయులు ఏ తరగతి కి పూర్తిగా దృష్టి పెట్టలేక ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు మదన పడుతున్నారు. ఇలా ఒకే గదిలో ఎక్కువమంది విద్యార్థులు ఉండటం వలన ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం తగ్గి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడానికి దారి తీసే అవకాశం ఉంది.

ఊసే లేని వంటగది

ఈ పాఠశాలలో వంటగదిని నిర్మించలేదు పాఠశాల ఆవరణం లోనే నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేసిన నాలుగు పిల్లర్ల మధ్యలోనే రేకులు అడ్డుగా పెట్టుకుని వంట ఏజెన్సీ నిర్వాహకులు వంట చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వారి ఇబ్బంది వర్ణనాతీతం. ఇలా అరకొర వసతుల నడుమ భోజనాన్ని సమకూర్చాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎంఈఓ-1 రామచంద్రుడు వివరణ

ఎస్ఎస్ఎ చైర్మన్ నుండి ప్రతిపాదనలు అందాయి. అదనపు తరగతులు నిర్మించుటకు స్థలం గురించి ఎమ్మార్వోకు తెలిపాం. త్వరలోనే అదనపు తరగతి గదుల నిర్మాణం ప్రారంభమవుతుంది.

గదులు నిర్మిస్తే విదార్థుల సంఖ్య పెరుగుతుంది

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది దీనివల్ల గదుల కొరత ఏర్పడింది. అదనపు తరగతి గదులు నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి నూతనంగా అదనపు తరగతి గదులు నిర్మాణం చేయాలి.

- విజయ్ గోరంట్ల గ్రామం.

అదనపు తరగతి గదులను నిర్మించాలి

స్కూలుకు ఎదురుగా ఉన్న ఆరు సెంట్ల స్థలంలోనే అదనపు తరగతి గదులు నిర్మించాలి. అధికారులు మాత్రం జగనన్న కాలనీలో స్థలం కేటాయించి అక్కడే అదనపు తరగతి గదులు నిర్మిస్తామని అంటున్నారు. దీనివలన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆటంకం కలుగుతుంది.

- ఆకేపోగు రాజు, గోరంట్ల గ్రామం.

అబ్బాస్ నగర్‌లో మురుగు కాలువలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధి 27వ వార్డు అబ్బాస్‌నగర్ లో కొత్తగా మురుగు కాలువలు నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. సిపిఎం ప్రతినిధి బృందం ఆదివారం అబ్బాస్‌నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి ఏసు,కృష్ణానగర్ కార్యదర్శి ఎం.లక్ష్మయ్య, ఎస్.అక్బర్‌బాషా, ఎ.రవికుమార్ మాట్లాడుతూ 25 సంవత్సరాల కిందట కల్లూరు గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు చిన్నచిన్న కాలువలు నిర్మించారని, ఆ కాలువలు ఇప్పుడు దెబ్బతిని కాలువలు లేని పరిస్థితి ఉందన్నారు. మురుగు నీరు మొత్తం కాలువ లేని కారణంగా ఎక్కడికక్కడ నిలబడి దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వము వెంటనే స్పందించి కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ పర్యటించి 27వ వార్డు అబ్బాస్ నగర్‌లో రవీంద్ర స్కూల్ నుంచి కృష్ణానగర్ రైల్వే గేట్ అండర్ బ్రిడ్జి వరకు మెయిన్ కాలవలు అబ్బాస్ నగర్ నాలుగు లైన్లలో కాలువలు కూడా వేయాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే రాబోవు కాలంలో అక్కడ ప్రజలను సమీకరించి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

పరిశీలిస్తున్న నాయకులు

ఆర్ఐ సతీష్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల అనుమానాస్పద మృతి చెందిన ఆర్ఐ సతీష్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పిబివి సుబ్బయ్య డిమాండ్ చేశారు. శనివారం అయన కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ సతీష్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. అతని కుటుంబం చాలా పేదరికంలో ఉందన్నారు. ఆయనకు ప్రభుత్వం నుండి చెల్లించాల్సినటువంటి బెనిఫిట్స్ వెంటనే ఇచ్చేలా డిజిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే మృతుడు భార్యతో వెంటనే కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇవ్వాలన్నారు. మృతుడి కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న పిబివి సుబ్బయ్య

క్రీడల్లో కర్నూలుకు మంచి గుర్తింపు తేవాలి

- మాజీ ఎంపి టిజి.వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడల్లో కర్నూలుకు మంచి గుర్తింపు తీసుకురావాలని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజు సాధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిజివి, టిజిబి తైక్వాండో వ్యవస్థాపకులు టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోటీలలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో స్పోర్ట్స్ అసోసియేషన్ కర్నూల్ డిస్టిక్ కార్యదర్శి టి అజయ్, తైక్వాండో శిక్షకులు నందిని, అశ్విని, శ్రీ లలిత, వెంకటేష్, బాక్సింగ్‌అసోసియేషన్ ఆఫ్ కర్నూల్ డిస్టిక్ కార్యదర్శి టి తేజ పాల్గొన్నారు.

మెడల్స్ అందజేసి అభినందిస్తున్న మాజీ ఎంపీ టిజి వెంకటేష్

విలేజ్ మార్కెట్ నిర్వీర్యం

- శిలాఫలకాన్ని కనుమరుగుచేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న పాలకులు,అధికారులు
- మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి-నందవరం

గ్రామంలో ఉన్న విలేజ్ మార్కెట్ నిర్వీర్యమైందని టిడిపి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావ్ దేశాయ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నందవర గ్రామ ప్రజల సంక్షేమం కొరకు, రైతులు, వ్యాపారులు కూరగాయలు విక్రయించడానికి గత టిడిపి హయాంలో విలేజ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. 2018వ సంవత్సరంలో అప్పటి మంత్రి నారాలోకేష్ శంకుస్థాపన చేశారన్నారు. మార్కెట్ ప్రారంభంలో శిలాఫలకం నిర్మించామని, ప్రస్తుతం అది కనుమరుగైపోయే పరిస్థితి నెలకొందన్నారు. శిలాఫలకం ముందు వ్యాపార నిమిత్తం ఆదివారం బంకును ఏర్పాటు చేశారన్నారు. మా ప్రియతమ నాయకులు విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పేరు ఉన్న శిలాఫలకం కనిపించకుండా బంకును అడ్డంగా ఉంచారని మండిపడ్డారు. గ్రామంలో అధికారులలో ఉన్న వైసిపి నాయకులు అటువంటి వ్యాపారులను ప్రోత్సహించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. శిలాఫలకం ముందు ఏర్పాటుచేసిన బంకును తొలగించాలని లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విలేజ్ మార్కెట్లో కూరగాయలు విక్రయించడానికి ప్రస్తుతం విశాలమైన ప్రదేశం ఉన్నా ఆ ప్రదేశంలో వ్యాపారాన్ని నిర్వహించలేమని వ్యాపారం చేసే మహిళలు, గ్రామ మహిళలు తమ దృష్టికి తెచ్చారన్నారు. ప్రస్తుతం ఆ ప్రదేశం మందుబాబులకు మద్యం సేవించడానికి పురుషులకు అడ్డగా మారిందన్నారు. అటువంటి ప్రదేశంలో తమకు భద్రత ఎక్కడుందని వారి బాధను తన దృష్టికి తెచ్చారన్నారు. వ్యాపారులు కూరగాయలను రోడ్లపైనే అమ్మకాలు నిర్వహిస్తున్నారు. రోడ్డుపైన అమ్మకాలు జరగడం వలన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. దుమ్ము ధూళి చేరిన కూరగాయలు తినడం వలన ప్రజలు అనారోగ్యాలు పాలవుతున్నారన్నారు. పంచాయతీ కార్యాలయం ముందే ఈ తతంగమంతా జరిగినా గ్రామ పాలకులు, పంచాయతీ, మండల అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టి మార్కెట్ సదుపాయాలను ప్రజలకు అందించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న మాధవరావు దేశాయ్

అబాకస్ వేదిక్ మాథ్స్‌లో 'ఎఫ్ఆర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - దేవనకొండ : అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీ పరీక్షలలో ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ పి.ఫరుసునాథ్, ప్రధాన ఉపాధ్యాయులు బి.ఉక్రీరప్ప తెలిపారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణం నలంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు. వేదిక్ మ్యాథ్స్‌లో ఎస్.సాక్ అలీ ఫస్ట్ ప్రైజ్ సాధించారని చెప్పారు. అబాకస్ సీనియర్ లెవెల్‌లో ఫస్ట్ ప్రైజ్ ఎస్ రిహనా సాధించారని చెప్పారు. అబాకస్ స్టార్ లెవెల్‌లో బి దర్శన్ శన్ విద్యార్థి కూడా ఫస్ట్ ప్రైజ్ సాధించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో ఎఫ్ఆర్ హై స్కూల్ మూడు బహుమతులు సాధించటం పట్ల హర్షం వెలిబుచ్చారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ఎండి బాషా, పి.శ్రావణి, పరమేశ ,ఇ.హేమలత , బిపుసేషా తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు పెద్ద తుంబలం ఎస్ఐ విద్య శ్రీ ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని డిఎస్పీ హేమలత ఆదేశాల మేరకు ఆదోని తాలూకా ఎస్ఐ నల్లప్ప ఆధ్వర్యంలో పెద్దతుంబలం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సొంత వైద్యం ప్రమాదకరం

ప్రజాశక్తి-ఆదోని

అనారోగ్య సమస్యలు ఉన్నవారు సొంతంగా మందులు వాడి వ్యాధి తీవ్రతను పెంచేలా వ్యవహరించకుండా డాక్టర్లను సంప్రదించి చికిత్సలు పొంది ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని డాక్టర్ రత్నాకర్ బిహెచ్ఎంఎస్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. హోమియోపతిలో అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్న నొప్పులు వచ్చినా మాత్రలు వాడి సైడ్ ఎఫెక్ట్‌తో బాధపడడం చూస్తున్నామన్నారు. హోమియోపతిలో అన్ని రకాల జబ్బులకు మందులు ఉన్నాయని, శరీరంపై దుష్ప్రభావాలు చూపకుండా వ్యాధి నయం అవుతుందన్నారు. ఆదోని పట్టణంలో ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల కాంప్లెక్స్‌లో వైరల్ చిల్ల ఆసుపత్రి నెలకొల్పామన్నారు. సైనోసిస్, చర్మ వ్యాధులు, కిడ్నీలో రాళ్ళు, కీళ్ళ నొప్పులు, బిపి, షుగర్, మలబద్ధకం, ఆస్తమా, డయాబెటిక్, హైపర్ టెన్షన్, థైరాయిడ్, అలర్జీ, జ్వరం, జలుబు, దగ్గు, ఎడి హెచ్ డిటి, సోరియాసిస్, ఫిస్టులా, ఫిషర్స్, రుమ ట్రాయిడ్, ఆర్థ రైటిస్, సంతానలేమి సమస్యలు, పిసిఒడి, ఎస్ఎ ఎటిఐ సిఎ, మైగ్రేన్, వెన్నునొప్పి మొదలగు వ్యాధులు చూడడం జరుగుతుందన్నారు. అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ క్లినిక్‌ను ఒక్కసారి సందర్శించి ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని డాక్టర్ రత్నాకర్ సూచించారు.

ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రవేట్ ట్రావెల్ బస్సు

- ఒకరు మృతి - పలువురికి గాయాలు

ప్రజాశక్తి-ఆస్పరి

ఆస్పరి నుండి ఆదోనికి వెళ్లే రహదారిలో నగరూర్ బస్ స్టాప్ దాటిన తర్వాత కల్వర్ట్ దగ్గర ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్ను ప్రవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో మద్దిలేటి వడ్డె చిన్న మద్దిలేటి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. సిఐ గంగాధర్ వివరాల మేరకు నంద్యాల జిల్లా, బనగాన పల్లి మండలం, యనకండ్ల గ్రామానికి చెందిన మద్దవరం చిన్న మద్దిలేటితో పాటు ముక్కమల్ల లక్ష్మీనరసింహ, నాగేశ్వర రావులు పలుగూరు గ్రామంలోని గనివద్ద నాపబండను ట్రాక్టర్‌లో లోడ్ చేయించుకొని కౌతాళం మండలానికి బయల్దేరారు. బెంగళూరు నుండి మంత్రాలయానికి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు నగరూరు బస్‌స్టాప్ సమీపంలో ఉన్న కల్వర్టు దగ్గర వెనుక వైపు నుండి వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న మద్దిలేటి మృతి చెందాడు. ముక్క మల్ల లక్ష్మీ నరసింహ, నాగేశ్వర రావుకు రక్త గాయాలయ్యాయి. ప్రవేట్ బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బ తిన్నప్పటికీ అందులో ఎవరికి గాయాలు కాలేదు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముక్కమల్ల లక్ష్మీ నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మృతి చెందిన చిన్న మద్దిలేటి

సిగ్నల్స్‌తో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ జరిగేనా..?

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుంది. ఇరుకు రోడ్లు ఉండడంతో వాహనాల రద్దీ పెరుగుతూనే ఉంది. ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కొత్త బస్టాండ్ రోడ్డు పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి శ్రీనివాస భవన్ వరకు ఎప్పుడు వాహనాలు రద్దీ ఉంటుంది. ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపకుండా, అధికారులు కేవలం 'రంగు రంగుల సిగ్నల్ లైట్ల'తో పోలీస్ కంట్రోల్ రూమ్ భీమాస్ సర్కిల్ మున్సిపల్ రోడ్డులో సిగ్నల్స్ స్తంభాలు ఏర్పాటు చేశారు. సిగ్నల్స్ స్తంభాలు ఏర్పాటు సరే క్రమబద్ధీకరణకు చర్యలు ఏమిటంటూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడలిలో సిగ్నల్స్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలపై సోషల్ మీడియా వేదికగా విమర్శల జడివాన కురుస్తోంది.

రోడ్లు వెడల్పు చేయాలి : ఆదోని మున్సిపల్ రోడ్డు పండిట్ నెహ్రూ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయి. నిర్మాణాల రోడ్ల ఆనుకొని జరగడం వల్ల దుకాణదారులు క్రమేపి ప్లైకులు సైతం రోడ్డుపైనే నిలవాల్సిన పరిస్థితి ఉంది. రోడ్లు వెడల్పు చేయకుండా సిగ్నల్స్ పెట్టడం వల్ల వాహనాలు పచ్చ లైట్ వెలిగే వరకు ఆగడం వల్ల మరింత రద్దీ ఏర్పడే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు జరిగేనా : ఆదోని పట్టణంలో అక్రమ కట్టడాలు పెరుగుతూనే ఉన్నాయి. కట్టడి చేయాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తూ ఉండడం వల్ల రోడ్లు ఇరుకుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని రోడ్లు వెడల్పు చేయిస్తామని, ట్రాఫిక్ సమస్య తీరుస్తామని చెప్పడం అధికారంలోకి రాగానే మరిచిపోవడం జరుగుతూనే ఉంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఫుట్‌పాత్ లేకపోవడం వల్ల రోడ్డుపైనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. సైతం రోడ్లు లేని పరిస్థితి ఉంది. అడుగు తీసి అడుగు వేయలేని ఇరుకు రోడ్లలో సిగ్నల్స్ పెడితే ట్రాఫిక్ తగ్గుతుందా లేక మరింత స్తంభిస్తుందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి పక్కా మాస్టర్ ప్లాన్ ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను నిలదీస్తున్నారు.

పునరావృతమవుతున్న తప్పులు: గతంలో కూడా లక్షల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేసి సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కానీ అవి ఏమాత్రం ఉపయోగపడకుండా మూలకు పడ్డాయని ప్రజలు గుర్తు చేస్తున్నారు. మళ్లీ అదే తప్పును చేస్తూ ప్రజా ధనాన్ని వృథా చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి : గోపాల్ వాహనదారుడు

ఆక్రమణలను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి. రోడ్లు వెడల్పు అయిన తర్వాతే సిగ్నల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి. అలంకారప్రాయమైన లైట్లు కాదు. సాఫీగా సాగిపోయే విశాలమైన రోడ్లు కావాలి. అధికారులు ఇప్పటికైనా స్పందించి, తాత్కాలిక మెరుగులు కంటే శాశ్వత పరిష్కారాల వైపు దృష్టి సారించాలి.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు : సిఐ గౌస్

ఆదోని పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇరుకు రోడ్లలో వచ్చినవే అమలు చేస్తున్నాం. వారి వాహనాలను బైపాస్ గుండా పంపిస్తున్నాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆయా ప్రాంతాలలో పోలీసులను ఏర్పాటు చేశాం. సిగ్నల్స్ వ్యవస్థ త్వరలోనే అమలు లోకి వస్తుంది. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగేలా చూస్తాం.

పవర్ గ్రిడ్ ఆగడాలను అరికట్టండి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలోని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి భూములను కారు చౌకగా కొట్టేయాలని ప్రయత్నిస్తున్న పవర్‌గ్రిడ్ అధికారుల ఆగడాలను అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మనేకుర్తి గ్రామంలో పవర్‌గ్రిడ్ బాధిత రైతుల సమావేశం రైతు సంఘం జిల్లా నాయకులు పి.హనుమంతు అధ్యక్షతన నిర్వహించారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ మనేకుర్తి గ్రామంలో ఉన్న సారవంతమైన భూములను పవర్‌గ్రిడ్ కంపెనీకి ఇవ్వబోమని కలెక్టర్‌కు, ఆర్‌డిఒకు పదేపదే విన్నవించినా ఏ మాత్రం పట్టించుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. గ్రామంలో సాగుకు పనికిరాని భూములు ఉన్నాయని, వాటిని రైతులు స్వచ్ఛందంగా ఇస్తామని ముందుకు వచ్చిన పవర్ గ్రిడ్ యాజమాన్యం సారవంతమైన భూములలోని పవర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. మండలంలోని పక్క గ్రామాలలో భూములు ఇస్తామని తెలిపిన పవర్‌గ్రిడ్ అధికారులు, రెవెన్యూ అధికారులు రైతుల మధ్య అనైక్యతను ఆసరగా చేసుకుని కారు చౌకగా రైతుల భూములను కొట్టేయాలని చూస్తున్నారని అన్నారు. తరతరాలుగా గ్రామాలలో భూములు నమ్ముకుని జీవిస్తున్న రైతాంగాన్ని ఒక్కసారిగా పవర్ గ్రిడ్ యాజమాన్యం పదేపదే ఒత్తిడి చేయడం వల్ల రైతులు తీవ్రమైన మనోవేదనకు గురి అవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సాగుకు పనికిరాని బంజరు భూములలో పవర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని వారన్నారు. రైతులను పదేపదే ఫోన్ చేస్తూ మీ భూములు ఇవ్వాలని లేకపోతే బలవంతంగా నైనా మీ భూములలో ఏర్పాటు చేస్తామని మాట్లాడుతున్న పవర్ గ్రిడ్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా వారసత్వంగా వచ్చిన సారవంతమైన భూములను పవర్‌గ్రిడ్ కంపెనీకి ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. చివరి వరకు ఎపి రైతు సంఘం రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ భూ నిర్వాసితులు నాగరాజు, కృష్ణ, ఈరన్న, చిన్న అంజనేయ, దేవేంద్ర, ప్రకాష్, ఆగులూరి, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ

గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం తీవ్రం

- రెండో రోజు ఆమరణ నిరాహార దీక్ష
- ప్రజాభిప్రాయం లేని విభజన మాకొద్దు

ప్రజాశక్తి-ఆదోని

ప్రతిపాదిత పెద్ద హరివాణం మండలంలో తమ గ్రామాలను వీలినం చేయడం సమంజసం కాదంటూ ఉద్యమం తీవ్రతరం చేశారు. పెద్ద హరివాణంలో 16 గ్రామాల వీలినం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ టిడిపి నాయకుడు చిన్న గోనెహాలు గోపాల్ రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరింది. ఆదోని పట్టణంలోని శ్రీనివాస భవన్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన దీక్ష శిబిరానికి ఆయా గ్రామాల ప్రజలు సంఘీభావం తెలిపి మద్దతు తెలుపుతున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో ఇరుకు రోడ్డు ఉండడంతో వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, తమ గ్రామాలు ఆదోని మండలంలోని కొనసాగాలని నారాయణపురం, దాణాపురం, చాగి, నాగనాతనహళ్లి, మదిరే,బసాపురం గనేకల్, చిన్న హరివాణం, చిన్న గోనెహాలు, తదితర గ్రామాల వాసులు నిరసన చేస్తున్నారు. ఆదోని పట్టణంలో ప్రజా పోరాటం ఉధృతమైంది. 16 గ్రామాల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా సాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతూనే ఉంది. వందలాది మంది గ్రామస్తులు తరలిరావడంతో ఆదోని వీధులు నిరసన జ్వాలలతో అట్టుడికి పోతున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన జడ్‌పి మాజీ చైర్మన్ దానాపురం తిక్కన, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మహేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి ఆరోగ్యం గురించి అరా తీశారు. వారు మాట్లాడుతూ ప్రజా డిమాండ్‌ను పరిగణంలోకి తీసుకోకుండా ఏకపక్ష ధోరణి అవలంబిస్తున్న ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏదైనా మార్పు చేసేటప్పుడు ప్రజల అభిప్రాయాలు తీసుకోవడం కనీస ధర్మమన్నారు. ఈ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తూ 16 గ్రామాల ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా చేసిన ఈ విభజన చెల్లదని ఆయన స్పష్టం చేశారు. వైసిపి ఈ పోరాటంలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీనివాస్ భవన్ మెయిన్ రోడ్డువద్ద నిరసనకారుల తాకిడితో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయినా, తమ గోడు వినే వరకు కదిలేది లేదని ప్రజలు భీష్మించుకుని కూర్చున్నారు. గోపాల్ రెడ్డి ప్రాణాలకు ఏమైనా ప్రమాదం జరిగితే దానికి పాలకులే సమాధానం చెప్పాలి అంటూ 16 గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరిస్తున్నారు. నాయకులు రామకృష్ణారెడ్డి, రాముడు, రామస్వామి వెంకటేష్ చౌదరి, కారుమంచప్ప ,గోవిందు, సోమశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండల పరిధిలో బల్లెకల్ గ్రామంలో 75 శాతం పైప్ లైన్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తాగునీరు అందక తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే జలజీవన్ మిషన్ ద్వారా పైప్ లైన్ మంజూరు చేసి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బల్లెకల్ గ్రామంలో వీధుల్లో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగడానికి నీళ్ల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నామని, మరోపక్క వాడుకోవడానికి ఉపయోగించే మోటర్ కూడా చెడిపోయి నెలరోజులవుతున్నా సర్పంచి అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు సరిగా లేక డ్రెయినేజీ నీరు అస్తవ్యస్తంగా మారిపోయిందన్నారు. తక్షణమే రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే తాగునీటి సమస్యను , రోడ్లు డ్రైనేజీల సమస్యను పరిష్కరించని పక్షంలో సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి ఇ.వీరేష్, పార్టీ సభ్యులు ఉరుకుందు, శ్రీకృష్ణ, రమేష్, ఇ.రవి, లింగయ్య గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లింగన్న

ఆరోపణలు అవాస్తవం : మల్లప్ప గౌడు

ప్రజాశక్తి-నందవరం : నందవరం గ్రామానికి చెందిన కారుమంచి బసవరాజుగౌడ్ మాపై చేసిన ఆరోపణలు ఆ వాస్తవమని మల్లప్పగౌడ్, చిన్న మల్లప్పగౌడ్, కుటుంబ పెద్దలు తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. ఇంటి ముందు ఉన్న మా స్థలాన్ని ఆయన స్థలమంటూ శనివారం రోజున డిఎస్‌పి భార్గవ్ కి వినతి పత్రాన్ని ఇచ్చారు. అదేవిధంగా ఆయన పత్రిక ప్రకటన కూడా ఇవ్వటం జరిగిందన్నారు. మా ఇంటి ముందు స్థలం తనదంటూ దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ బండలు పాతే ప్రయత్నం చేశారన్నారు. అసత్య డాక్యుమెంటును పుట్టించి మమ్మల్ని బయటపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 1929 సంవత్సరంలో మా పెద్దలు రామన్నగౌడ్ పూలచింత గ్రామానికి చెందిన జంబు బసవరాజ్ గౌడ్ దగ్గర ఈ స్థలాన్ని కొన్నారన్నారు. సుమారుగా 96 సంవత్సరాలుగా పెద్దల కాలం నుండి ఇప్పటివరకు ఈ స్థలంలో అనుభవంలో ఉంటు నివాసం సాగిస్తున్నా మని తెలిపారు. 100 అడుగుల పొడవు గల స్థలంకు సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్ పత్రాలు ఉన్నాయని చెప్పారు. మా స్థలాన్ని తన స్థలమంటూ కారుమంచి బసవరాజుగౌడ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. 96 సంవత్సరాల నుండి ఈ ప్రదేశంలో నివాసం ఉంటున్నామని, ఈ ప్రదేశంలో బోర్ వేసి చెట్లు పెంచుకున్నా మన్నారు. ఈ స్థలం ఆయనది అయితే అప్పుడే అడ్డుకోవచ్చు కదా అని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా మా వల్ల ప్రాణహాని ఉందని, ఆయనపై దాడి చేశామని పత్రికలో రావడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. మాపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు.

మాట్లాడుతున్న మల్లప్ప గౌడ్

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమించాలి: జెఎసి

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

ఆదోని జిల్లా సాధన జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 19వ రోజు రిలే నిరాహారదీక్షకు మద్దతుగా విద్యార్థి సంఘం నాయకులు ఉదయ్, శేఖర్, అఫ్రిది, రఘు, ఖాజా,కృష్ణ, దీక్షకు ఆదివారం కూర్చున్నారు. సంపూర్ణ మద్దతు తెలిపారు. జెఎసి ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఎస్‌టియు సంపూర్ణ మద్దతుగా పాల్గొంటామని నాయకులు తెలిపారు. నాయకులు ,విద్యార్థి నాయకులకు పూలమాలవేసి కండువా కప్పి దీక్షను ప్రారంభించారు. అనంతరం ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడివన్న, మాజీ కార్యదర్శి ఎర్రిస్వామి, మాజీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, తులసిరామ్, తిమ్మన్న తదితరులు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఆదోని డివిజన్ ఉందన్నారు. వీటన్నిటికీ ప్రత్యేక సంజీవిని ఆదోని జిల్లాగా ప్రకటించడమేనన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఆదోని జిల్లాగా ప్రకటించాలన్నారు. ప్రజల వలసల నివారణకు ఆర్‌డిఎస్ కుడి కాలువ, గుండ్రేవుల వేదవతి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. అక్షరాస్యతలో బీహార్ కంటే వెనుకబడి ఉన్నామని, అత్యంత అల్పాక్షరాస్యత కలిగినటువంటి కోసిగి, కౌతాళం, మండలాలు ఉన్నాయని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘ నాయకులు, ప్రసాద్, రాజు, బాలరాజు, సత్యన్న, అనీఫ్ జయరాం ,బతుకన్నా సత్యానారాయణ రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

దీక్ష నిర్వహిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

గుండెపోటుతో డీలర్ మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బత్తిన లక్ష్మన్న(52) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచి బత్తిన ఉచ్చిరప్ప సోదరుడు లక్ష్మన్నకు చాతిలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రిలోకి వెళు తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వైద్యులు పరీక్షలు చేయగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. పెద్ద కుమారుడుకృష్ణసాయి (19) గత 18 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారాన్ని పోషించే యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అమ్ముకున్నాయి. కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

లక్ష్మన్న (ఫైల్)

ఉపాధ్యాయులను భయపెట్టి పని చేయించలేరు : ఎస్‌టియు

ప్రజాశక్తి-ఆదోని

పదవ తరగతి పరీక్ష ఫలితాలు మెరుగు పడాలనే కారణంతో ఉపాధ్యాయులపై చర్యల పేరుతో భయాందోళన కు గురిచేయడం తగదని ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు మహదేవప్ప అన్నారు. ఆదోని, కౌతాళం మండలాల నాయకుల సమావేశం ఆదోని ఎస్‌టియు భవన్‌లో ఆదివారం మండల ఎస్‌టియు అధ్యక్షుడు పి.అంజనయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అని ప్రాథమిక విద్యార్థులకు జిఎఫ్ఎల్ఎ అనే పేరుతో పాఠశాలల్లో చేస్తున్న విద్యాబోధనలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం తగదన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక బయాందోళనకు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ సూర్యుడు, ఆదోని మండల అధ్యక్షులు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి చింతకుంట రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి పి.షేక్షావలి సీనియర్ నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

MISSING OF LINK DOCUMENTS

I, **ANNEM VEERA NAGESWARA REDDY** would like to inform the general public that I have misplaced my **LINK DOCUMENTS** bearing **DOCUMENT NOS: 14865/2007, 595/2007, 22/1999, 5358/1990, 5927/1989 & 985/1984, RO KURNOOL** have been lost by me while travelling from Kurnool Bus Stand to Kurnool District Court by Auto. The said original registered Link documents could not traced and beyond recovery. If any one finds it kindly contact me at **within 15 days** from the date issued of this matter.

ANNEM VEERA NAGESWARA REDDY,
S/o. Late. ANNEM BALA VEERA REDDY,
R/o. H.No:1-65C, Emapadu Village,
Bandi Athmakur Mandal,
Nandyal Dist, A.P., India.
Ph No: **9849694919**

మహారాజశ్రీ గౌరవనీయులైన IV వ అదనపు జిల్లా జడ్జి కోర్టు
: : KURNOOL
E.P.No.52/2020 in A.A.No.466/2012
Between:
M/s Shriram Transport Finance Co Ltd,.
Represented by its GPA Holder.
...Claimant/Decree Holder
-Versus-
Om SAi constructions its
ABV Suresh and another.
....Respondents/Judgment Debtors
The JDr 1
Om Sai Constructions its Managing Partner
A.B.V.Suresh, S/o.LakshmiNarayana Setti,
H.No.1-151-A9/1, Near Sree Rama Theatre,
Near Bus Stand, Nandikotkur Town, Kurnnool.
1వ ప్రతివాది ఆర్డర్ 21 రూల్ 54 C.P.C నోటీసు
పైన కనబరిచిన కేసు అమలు అర్జి (E.P) లో వాది అయినటువంటి శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1 వ ప్రతివాది అయిన (JDR.No.1) మీపైన Arbitration award పొంది, అ అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జి (E.P) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు ఆర్జి నందు కోర్టు వారు మీకు మీరున్న చిరునామాకు Order 21 Rule 54 నోటీసులు ఎన్నిసార్లు పంపించినను ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతున్నారు. కావున పై అమలు ఆర్జి నందు మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నా ఎడల పై కోర్ట్ వారి యెదుట Date: 30-12-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు కర్నూలు కోర్టు నందు హాజరై మీ ఆకాంక్షలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జి మీకు వ్యతిరేఖముగ తీర్మామనించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Hearing Date: 30-12-2025
Sri C.Lokeswaraiah &
Sri K.Narasimhulu
D.HR తరపు న్యాయవాదులు, కర్నూలు.

మహారాజశ్రీ గౌరవనీయులైన VII వ అదనపు జిల్లా జడ్జి కోర్టు
: : KURNOOL
E.P.No.612/2023 in A.A.No.854/2019
Between:
M/s Shriram Transport Finance Co Ltd,.
Represented by its GPA Holder.
...Claimant/Decree Holder
-Versus-
G.Venu Gopal Naidu and another
...Respondents/Judgment Debtors
JDr 1
G.Venu Gopal Naidu S/o G.Moha Raju Naidu
H.No.4-532, Geethamukarji nagar,
near basha hotel, Mamidalapadu, kurnool
1 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 C.P.C నోటీసు
పైన కనబరిచిన కేసు అమలు అర్జి (E.P) లో వాది అయినటువంటి శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1 మరియు 1వ ప్రతివాదులయినటువంటి (JDR.No.1) మీపైన Arbitration award పొంది, అ అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జి (E.P) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు ఆర్జి నందు కోర్టు వారు మీకు మీరున్న చిరునామాకు Order 21 Rule 37 నోటీసులు ఎన్నిసార్లు పంపించినను ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతున్నారు. కావున పై అమలు ఆర్జి నందు మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నా ఎడల పై కోర్ట్ వారి యెదుట Date: 31-12-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు కర్నూలు కోర్టు నందు హాజరై మీ ఆకాంక్షలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జి మీకు వ్యతిరేఖముగ తీర్మామనించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Hearing Date: 31-12-2025
Sri B.Chandra sekhar &
Sri K.Narasimhulu
D.HR తరపు న్యాయవాదులు, కర్నూలు.

మహారాజశ్రీ గౌరవనీయులైన VII వ అదనపు జిల్లా జడ్జి కోర్టు
: : KURNOOL
E.P.No.625/2023 in A.A.No.627/2019
Between:
M/s Shriram Transport Finance Co Ltd,.
Represented by its GPA Holder.
...Claimant/Decree Holder
-Versus-
S.K.Mukthar and another
....Respondents/Judgment Debtors
JDr 1
Mukthar S.K, H.No.24-104-A,
GaniGalli street,Kurnool-518001
JDr 2
Mustaqahmed.S , H.No.24-40-A,
Nagamuniveedhi, Kurnool-518001
1 మరియు 2వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 C.P.C నోటీసు
పైన కనబరిచిన కేసు అమలు అర్జి (E.P) లో వాది అయినటువంటి శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1 మరియు 2వ ప్రతివాదులయినటువంటి (JDR.No.1&2) మీపైన Arbitration award పొంది, అ అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జి (E.P) ధాఖలు చేసి ఉన్నారు. పై అమలు ఆర్జి నందు కోర్టు వారు మీకు మీరున్న చిరునామాకు Order 21 Rule 37 నోటీసులు ఎన్నిసార్లు పంపించినను ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతున్నారు. కావున పై అమలు ఆర్జి నందు మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నా ఎడల పై కోర్ట్ వారి యెదుట Date: 30-12-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు కర్నూలు కోర్టు నందు హాజరై మీ ఆకాంక్షలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జి మీకు వ్యతిరేఖముగ తీర్మామనించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Hearing Date: 30-12-2025
Sri B.Chandra sekhar &
Sri K.Narasimhulu
D.HR తరపు న్యాయవాదులు, కర్నూలు.

IN THE COURT OF THE HON'BLE IV ADDL DIST. JUDGE :: KURNOOL:
E.P.No.: 29/2024 in A.A.No.324/2021
Between:
M/s Shriram Ltd,.KNL-1
Represented by its GPA Holder.
...Claimant/Decree Holder
-Versus-
Mr.Kasepogu Suresh and another
...Respondents/Judgment Debtors
To
The JDr 1&2
1. Kasepogu Suresh S/o.K.Nagaraju
H no: 47-80-14, Budhawarapeta,
Near Medical Collage, Kurnool District
2.E.Erranna Goud S/O: E.Maheswar Goud
H no: 4-31-19-2, Near Narasimha Swamy
Temple, Balaji Nagar, Kurnool District
...JDR'S
1,2 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 సి.పి.సి నోటీసు :
పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాధి Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1,2వ ప్రతివాదులైన (JDr.1) మీ పైనా ఆర్బిటేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule. 37, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 29-12-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు kurnool కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
తేది: 29.12.2025
N.SANJEVARAYUDU,
M.NARAYANA NAIK
ADVOCAT FOR DHR KURNOOL

పప్పు శనగకు తెగుళ్ల బెడద

- అనుకూలించని వాతావరణం
- మందులు పిచికారితో మరింత పెట్టుబడి భారం
- వరుస తెగుళ్లతో కుదేలవుతున్న రైతులు

ప్రజాశక్తి-చిప్పగిరి

పప్పు సెనగ పంటను తెగులు బెడద వెంటాడుతుంది. ఒకవైపు ప్రతీ కూల వాతావరణంతో అల్లాడుతుండగా.. వేరుకుల్లతో పాటు ప్రస్తుతం 70 ,80 రోజులు కావస్తున్నా పైరుకు పసురు తెగులు సోకి ఎండిపోయిన పైరులా అవుతుండడంతో ఆశలన్ని నీరు గారుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పైరంతా పసుపు రంగుగా మారి కాయల్లోని గింజ నాసిరకంగా కుళ్లిపోయినట్లు తయారవుతుంది. తెగులు నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి మందులు పిచికారి చేసిన ప్రయోజనం లేకుండా పోతుంది. వేర్లన్నీతెల్ల బారుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కుతామని రైతులు అంటున్నారు. గత రెండు వరాల కిందట బాగున్న పైరు ఇప్పుడు చూస్తే రోజురోజుకు తెగుళ్లతో పైరంతా కూడా ఎండిపోయినట్లు కనపడుతుందని రైతులు తెలుపుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం రబీలో ప్రధాన పంట అయిన పప్పు శనగ పంట పైనే ఎక్కువగా రైతులు ఆధారపడి ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

తెగుళ్లతో పైరు ఎండితోంది. రైతు,సునీల్. నేమకల్లు గ్రామం

వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పప్పు శనగకు వరుస తెగుళ్ల సోకుతున్నాయి. ప్రస్తుతం పైరంతా పసుపు రంగుగా మారి ఎండిపోతుంది. తెగుళ్ల ప్రభావంతో దిగుబడులపై ఆశలన్నీ నీరు కారుతున్నాయి. గత రెండు వారాల కిందట పైరు బాగున్నా ఇప్పుడు రోజురోజుకు తెగులు సోకి పైరంతా కూడా ఎండిపోతునడంతో దిగుబడులు పూర్తిగా తగ్గుతాయని ఆందోళన చెందుతున్నాం.

ఒకే పంట వేయడంతోనే తెగుళ్లు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్

మండలంలోని చాలా గ్రామాలలో రైతులు తమ పొలాలలో ప్రతి సంవత్సరం ఒకే పంట సాగు చేస్తున్నడంతో, పంట మార్పిడి లేనందువలన తెగుళ్ల ప్రభావం అధికంగా ఉంది. ఒక లీటర్ నీటికి టేబు కొనజోల్ ఒక మిల్లీలీటర్ కలిపి చెట్టు తడిచేలా పిచికారి చేస్తే కొద్ది వరకు అరికట్టువచ్చు. పంట మార్పిడి చేస్తున్న పొలాలలో ఈ విధమైన తెగులు తక్కువగా కనిపిస్తున్నాయి. అందుకు ప్రతి రైతు కూడా పంట మార్పిడి అవసరమని రైతులు తెలుసుకోవాలన్నారు.

పేర్ల మార్పు కాదు బతుకులు మార్చండి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు కాదని, చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వక్తలు ముక్త కంఠంతో నిరసించారు. ఆదివారం రాత్రి పింగళి సూరన తెలుగు తోటలో కర్నూలు జిల్లా మేధావుల కన్సార్టియం ఆధ్వర్యంలోమహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పేరు మార్పు, కేంద్ర సాహిత్య అకాడమీ తీరు పై రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఈ సమావేశానికి సమన్వయకర్తలుగా మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధ్యక్షులు ఆచార్య ఎస్.మన్సూర్ రహమాన్, గాడిచర్లఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ కల్కూర వ్యవహరించారు. చట్టం కావాలి స్కీం కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నాయకులు కెవి. నారాయణ అన్నారు. చట్టం నుంచి స్కీమ్ మార్చే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. దీన్నిఉద్యమాలతో మెడలు వంచి కాపాడు కుంటామన్నారు. సాహిత్య అకాడమీ అస్తిత్వాన్ని మార్చొద్దని చంద్రశేఖర కల్కూర అన్నారు ఆయన మాట్లాడుతూ సాహిత్య అకాడమీ ఈ ఏడాది అవార్డులు ప్రకటించ కుండా కేంద్రానికి సిఫారసు చేయడం దుర్మార్గమని అది తన అస్తిత్వాన్ని కోల్పో యిందన్నారు. స్వయం ప్రతి పత్తి సంస్థలా బిజెపి సంస్థలా అని సాహితీ స్రవంతిరాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కేంద్రం సిబిఐ, ఇడి వంటి సంస్థల్ని గుప్పెట్లో పెట్టుకున్నట్లే సాహిత్య అకాడమీ కూడా గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఈ సంస్థలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా గుర్తించాలన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు బి.గోరంట్లప్ప మాట్లాడూతూ ఉమ్మడి కార్యాచరణ అవసరమని అన్నారు. ఉపాధి హామీ చట్టంలో మార్పులు, సాహిత్య అకాడమీ తీరుపై జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేద్దామని అన్నారు. సాహిత్యవేత్త మారుతీ పౌరోహితం మాట్లాడుతూ ఇది దుర్మార్గ వైఖరి అని పేర్ల మార్పుతో ఒరిగేదేమిటన్నారు. అన్నీ తమ గుప్పిట్లో ఉంచుకునే వైఖరి తగదన్నారు. చర్చగోష్టిలో గ్రంథాలయ మాజీ చైర్మన్ గంగాధర్ రెడ్డి, పట్టణం పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ. పుల్లారెడ్డి, విరసం నాయకులు నాగేశ్వరాచారి, రచయిత ఇనాయతుల్లా, ఇమ్మనియేలు, ఎస్డివి అజీజ్, జె జెఎస్ఆర్కె శర్మ ప్రసంగించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

మరో ఇద్దరికి జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు

- ఇప్పటి వరకు ఐదుగురి జిల్లా బహిష్కరణ
- జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని షరీన్ నగర్‌లో నివాసముండే వడ్డే రేవంత్ కుమార్ , వడ్డే శివ కుమార్ లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో వీరిద్దరి పై కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ఎ.సిరి జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేశారు. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వడ్డే రేవంత్ కుమార్‌పై రౌడీషీట్ నెంబర్ 387 ఉంది. వడ్డేశివ కుమార్ పై రౌడీషీట్ నెంబర్ 388 ఉంది. వీరిద్దరూ 5 క్రిమినల్ కేసులలో నిందితులుగా ఉన్నారు. అందులో హత్యలు, దోపిడీలు, ఎస్సీ ఎస్టీ వర్గాల మీద దాడులు, జులుం కేసులు, హత్యాయత్నం కేసులు , ఇలా పలు రకాల కేసులు వీరిద్దరి పై నమోదయి ఉన్నాయి. పై తెలిపిన కేసుల్లో పలు మార్లు వీరిద్దరూ రిమాండ్‌కు వెళ్లి ఖైదు చేయబడినప్పటికీ కూడా ఇద్దరి ప్రవర్తనలో ఎటువంటిమార్పు రాకపోగా, మరి ఎక్కువగా వివిధ రకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ప్రతిపాదనల మేరకు వీరి క్రిమినల్ రికార్డులను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ఆదివారం వారిద్దరి మీద జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ...జిల్లాలో ఇప్పటివరకు చెడు నడత కలిగిన ఐదుగురు వడ్డే రామాంజనేయులు, పటాన్ ఇమ్రాన్ ఖాన్, వడ్డే తులసి కుమార్, వడ్డే రేవంత్ కుమార్, వడ్డే శివ కుమార్ జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటినుండి ఎవరైనా రౌడీయిజంతో అరాచక శక్తులుగా మారి , ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగజేసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిపై జిల్లా బహిష్కరణతో పాటుగా పిడి యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని జిల్లా ఎస్పి కోరారు. ఇటువంటి చెడు నడత కలిగిన చాలామంది పేర్లు జిల్లా బహిష్కరణ పరిశీలనలో ఉన్నాయని, మంచి ప్రవర్తనతో జీవించాలని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు.

వడ్డే శివకుమార్

వడ్డే రేవంత్

'గాడిద సలహా'పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

డాక్టర్ ఎం హరి కిషన్ రచించిన బాలల కథల పుస్తకం 'గాడిద సలహా' పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త వావిలాల కృష్ణమూర్తి చేతులమీదుగా వికెఎంఎస్ లీడర్స్ పాఠశాలలో ఆవిష్కరించారు. ప్రముఖ విద్యావేత్త వావిలాల కృష్ణమూర్తి మాట్లాడుతూ బాలలకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నీతి కథలు చెప్పడం ద్వారా వాళ్లలో నైతిక విలువలు పెరిగి, బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా తయారవుతారని ఈ దిశలో హరికిషన్ పుస్తకాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన లలిత కళా సమితి కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప మాట్లాడుతూ తల్లిదండ్రులు సినిమాలకు, షికారులకు, దుస్తులకు, తిండికి పెట్టే ఖర్చులో పది శాతమైనా చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి, చక్కని క్రమశిక్షణ అలవరిచే బాలల పుస్తకాల కోసం ఖర్చు పెట్టాలని, అవి వారి మనోవికాసానికి, దారితీసి ఆత్మ విశ్వాసాన్ని పెంపొంది స్తాయన్నారు. ప్రజా గాయకుడు బసవరాజు చక్కని పాటలతో చిన్నారులను ఆకట్టుకుంటూ వారి చేత పాడించారు. వికెఎం లీడర్స్ పాఠశాల చిన్నారులు ఎస్.అనన్య, యు.యశస్విని, ఎన్. డింపుల్ లక్ష్మీప్రియ, ఆర్.చరిత ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరి కిషన్ రచించిన పుస్తకాన్ని సమీక్షిస్తూ తాము మొదటిసారిగా స్టేజి మీద ఇలా పుస్తకాన్ని సమీక్షిస్తున్నామన్నారు. ఇది తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ గాడిద సలహా అనే ఈ పుస్తకంలో అన్ని చిన్నచిన్న కథలు ఉన్నాయని, చాలా సులభమైన భాషలో చక్కని నీతులతో, అందమైన రంగుల బొమ్మలతో, హాస్యంతో అందరినీ ఆకట్టుకుంటాయని ఆ కథల్లో తామకు నచ్చినవి ఎందుకు నచ్చాయో వివరించారు. వావిలాల కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున కళ్యాణదుర్గం స్వర్ణలత ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గాడిద సలహా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వావిలాల కృష్ణ మూర్తి , తదితరులు

ఆదోని జిల్లా కోసం 43వ రోజు దీక్ష

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని జిల్లా సాధన ఉద్యమం రోజురోజుకు తీవ్రమౌతుంది. అదోనికి జిల్లాగా ప్రకటిస్తే పశ్చిమ ప్రాంతంలో చదువుకున్న యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఆదోని మోటర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. ఆదోని జిల్లా సాధన కోసం పట్టణంలోని కోట్ల కూడలిలో జెఎసి చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 43వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆదోని మోటార్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు గోపాలకృష్ణ, ఖలీల్, ఇమ్రాన్ రహీం, ఏజాజ్, చిరంజీవి, దత్తు, గోరాబాష,మహబూబ్ కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వెనుకబడిన ఈ ప్రాంతా అభివద్ధికై జిల్లాగా ప్రకటించాలని 60 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారన్నారు. పాలకులు అభివృద్ధిని విస్మరించడంతో యువతకు ఉపాధి లభించక నగరాలకు డిగ్రీలు చేత పట్టుకొని ఉపాధి కోసం వెళ న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సాగునీరు తాగునీరు అందక పంటలు పండగ రైతులు రైతు కూలీలు వలసలు వెళ్తున్నారన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకి ఆందోళన ఉధృతం చేస్తామని జెఎసి నేతలు ప్రకటించారు.

అమరావతికి బయలుదేరిన జెఎసి నేతలు..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆదోని జిల్లాపై ప్రస్తావన లేకపోవడంతో తాడోపేడో సిఎంతో మంత్రి మంత్రులతో తేల్చుకునేందుకు జెఎసి నేతలు రఘురామయ్య, అశోక్ నంది రెడ్డి, కృష్ణమూర్తి గౌడ్ ,నూర్ అహ్మద్, కోదండ, కుంకనూరు వీరేష్, దస్తగిరి రామలింగతోపాటు మరో పదిమంది అమరావతికి బయలుదేరారు. వారు మాట్లాడుతూ మండలాలు విభజన కంటే ముందు ఆదోని జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జిల్లాలో పర్యటించక పోవడం తమ మనోభావాలను దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం పట్టిచ్చుకోకపోతే ఆమరణ దీక్షకు కూర్చుంటామని హెచ్చరించారు.

ఆదోని జిల్లా చేయాలని దీక్షలో కూర్చున్న మోటార్ మెకానిక్కు

హెల్మెట్ ధారణపై అవగాహన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల పోతున్న అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవాలని, ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యంగా యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్)ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని ట్రాఫిక్ సిఐ మన్సూర్ ఉద్దీన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మన్సూర్ ఉద్దీన్ మాట్లాడుతూ, 2025 సంవత్సరంలో కర్నూలు నగరంలోనే 42 మంది, జిల్లా వ్యాప్తంగా సుమారు 280 మంది రహదారి ప్రమాదాల్లో మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ మరణాల్లో అత్యధికులు హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారని, ఈ నేపథ్యంలో డిసెంబర్ 30వ తేదీ నుండి అమలు కానున్న "నో హెల్మెట్ – నో పెట్రోల్" విధానానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షులు దండు విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసు వారికి మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల తమ కుటుంబాలకు అండగా ఉండవచ్చని, ముఖ్యంగా ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కూడా విధిగా హెల్మెట్ ధరించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు నీలం సత్యనారాయణ మాట్లాడుతూ, నిర్లక్ష్యం వీడి హెల్మెట్ ధరించడం వల్ల పునర్జన్మ పొందుతారని, "అమ్మ జన్మనిస్తే.. హెల్మెట్ పునర్జన్మనిస్తుంది" అనే స్ఫూర్తితో ప్రతి వాహనదారుడు బాధ్యతగా మెలగాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ కొత్తపేట నుండి కొండారెడ్డి బురుజు, కలెక్టరేట్ మీదుగా సాగి రాజ్ విహార్ సర్కిల్ వద్ద ముగిసింది. ట్రాఫిక్ ఎస్ఐ హుస్సేన్ బాష, ట్రాఫిక్ సిబ్బంది, యుజెఎఫ్ ప్రతినిధులు పరమేష్, నాగేంద్ర, మెట్రో మధు, లోకేష్, వడ్డేమాన్ విజయ్, గిలిత్త విజయ్, కిషోర్, రాజశేఖర్, వైవి రెడ్డి, మధు, లోకేష్, లక్ష్మీనారాయణ, దామోదరం సంజీ వయ్య ఆజాద్, వడ్డేమాన్ ధనుష్, వారణాసి ప్రసాద్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న సిఐమన్సూర్ఉద్దీన్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పేకాటలో పదిమంది అరెస్ట్ -ఎస్ఐ తిమ్మారెడ్డి

ప్రజాశక్తి-నందవరం : ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంతమైన వాతావరణము జీవించాలని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. .ఎటువంటి క్రిమినల్ చర్యలలో పాల్గొనకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించినట్లు తెలిపారు. ఈరోజు కనకవీడు గ్రామంలో పేకాటలో పదిమంది అరెస్ట్ అయినట్లు తెలిపారు.సాయంత్రం నాలుగు గంటల సమయంలో కనకవీడు గ్రామం పేటకు వెళ్లే దారిలో దర్గా వెనక కంపచెట్ల కింద పేకాట ఆడుతుండగా వారిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుండి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

ప్రజాశక్తి-మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ మఠంలో సందడి నెలకొంది. కర్ణాటక రాష్ట్రంలో వరుసగా సెలవులు రావడంతో ఆదివారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు. తుంగభద్ర నదిలో స్నానాలు చేసిన భక్తులు కల్పవృక్ష షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా, ప్రధాన ఆర్చి నుంచి క్యూలైన్ ఏర్పాటు ద్వారా శ్రీ మఠంలో ప్రవేశించిన భక్తులకు శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్ అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, సేవలు చేయించిన భక్తులకు విఐపి దర్శనం ఏర్పాటు చేశారు. సిఐ రామాంజులు శ్రీ మఠం ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బంది ద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శన అవకాశం కల్పించారు. దర్శన అనంతరం విఐపి భోజన శాల, అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కార్మికులకు అండగా విశాఖపట్నంలో సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి సిఐటియు18 వ మహాసభల జాతీయ మహాసభల కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె ఇస్మాయిల్ సిఐటియు మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయంలో 17 రోజులు పాటు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సమస్యల సాధనకై సమ్మె చేశారు. సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో రాష్ట్రవ్యాప్తంగా అప్పటి తెలుగుదేశం , జనసేన నాయకులు మా ప్రభుత్వం వస్తే మీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికి కూటమి ప్రభుత్వం వచ్చి 18 మాసాలు అవుతున్నా మున్సిపల్ కాంటాక్ట్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అని అన్నారు. జాతీయ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు ప్రణాళిక ప్రకారం ఉద్యమాలకు సిద్ధం కావాలని సంఘం నాయకులు కోరారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నాయకులు బి మునీంద్ర కె. కాజా కె. గోర్భాషా సుశీలమ్మ మా బాష మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు

- పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రంట్రస్ట్ కర్నూలు వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ సహకారంతో ప్రతినెల 4వ ఆదివారం ఉచిత రెగ్యులర్ వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం అని డాక్టర్ నాగభూషణం తెలిపారు. ఆదివారం కర్నూలు ఇందిరా గాంధీ నగర్ సుందరయ్య భవన్‌లో ఉచిత రెగ్యులర్ వైద్య శిబిరం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించారు. ఈ శిబిరం 2022 జూన్ 19వ తేదీన డాక్టర్ గోపాల్,శివ నారాయణ ప్రారంభించారు. జివిఆర్ ఫౌండేషన్ ద్వారా మందులు తక్కువ ధరలకు అందిస్తున్నారు. నాటి నుండి నేటి వరకు 21 క్యాంపులను నిర్వహించారు. ప్రతి క్యాంపులో సుమారు 50 మంది దాకా ఈ వైద్య సేవలను వినియోగించు కుంటున్నారు.ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పర్యవేక్షణలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నాలుగవ ఆదివారం కర్నూలు సుందరయ్య భవన్‌లో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో చూపించుకునేందుకు బీపీ షుగర్ పరీక్షలు చేయించుకొని వస్తున్నారు. పక్షవాతం, ఫిట్స్ ,షుగర్, బిపి వంటి వ్యాధులతో వచ్చే వారికి రెండు నెలలకు సరిపడా మందులు కేవలం రూ.300 ఇవ్వబడును. మార్కెట్లో ఈ మందులు విలువ 2000 వరకు ఉంటుంది. ఈ అవకాశాన్ని సామాన్య మధ్యతరగతి పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఆదివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరాలలో డాక్టర్ నాగభూషణం, డాక్టరు వినోద్, డాక్టర్ సంధ్య, డాక్టర్ హనీఫ్, డాక్టర్ పూజితలు పాల్గొని రోగులకు సూచనలు సలహాలు అందిస్తూ వైద్యం సూచిస్తూ ఉంటారు. ప్రత్యేకించి ఈ వైద్య శిబిరంలో స్టాఫ్‌నర్స్ దుర్గ వచ్చిన రోగులందరికీ బిపిచెక్‌చేసి, షుగర్ పరీక్షలను కూడా నిర్వహించారు. ఈ వైద్య శిబిరాలలో మెడికల్ రెప్స్ ఖలీల్, ప్రసాద్ శర్మ ,పుల్లయ్య శాస్త్రి, రామసుబ్బయ్యలు మందులు పంపిణీ చేశారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం సభ్యులు బసయ్య ,రంగస్వామి, ఎండి.అంజిబాబు, యేసు రాజు, ప్రమోదు , హుస్సేనయ్య, ఎల్లా గౌడ్‌లు సహకారం అందించారు.



కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-ఆస్పరి : బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో శాంతిరాం కంటి ఆసుపత్రి కర్నూలు వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.బండమీద వెంకటేశ్వర్లు సేవాసమితి కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షతన ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సర్వేం ద్రియానం నయనం ప్రధానం మానవ అవయవాలు అన్నిటికంటే కన్ను చాలా ప్రధాన మైనదని, మనిషికి కంటి చూపు చాల ముఖ్యమని, కంటి చూపు లేకుంటే ప్రపంచం అంధకారంగా కనపడుతుందన్నారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని బస్సులో తీసుకొని వెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి ఇంటికి చేర్చుతామన్నారు. గ్రామ పెద్దలు వీరభద్ర, వెంకటేష్, లక్ష్మన, వీరేష్, నరసింహులు, బండ మీద వెంకటేశ్వర్లు సేవా సమితి సభ్యులు రమేష్, వీరేష్, శేఖర్,సురేష్, అనిల్, సూరి పాల్గొన్నారు.

అప్పలరాజుపై పీడీ యాక్టు తొలగించాలి

- ఇనుమూరు గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్టును ఉపసంహరించాలని, తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల రౌండే టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. అలాగే ఏలూరు జిల్లా ఇనుమూరు గ్రామ గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని, వారికి తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లు, గూండాలు, గంజాయి వ్యాపారులు, మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పెట్టాల్సిన పీడీ యాక్టును రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై బనాయించి, సెంట్రల్ జైలులో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. భూసేకరణకు అడ్డుతగిలే వారిని సహించేది లేదనే ఒక సందేశాన్ని ఇచ్చేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందన్నారు. ఇనుమూరులో గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలతో పాటు, న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు.

ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఈ చట్టాలను ప్రయోగించకుండా, ప్రజల తరపున పోరాడే వారిపై ఇటువంటి కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. నెల్లూరులో పెంచలయ్యను గంజాయి ముఠాలు హత్య చేస్తే వారిపై పీడీ యాక్టును ప్రయోగించలేదన్నారు. మాజీ ఎంపి పి మధు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఎద్దుయెత్తున దాడి చేసేందుకు సిద్ధమయిందని చెప్పారు.

మత్స్యకారులు జీవనోపాధిని దెబ్బతీయడంపై పోరాడుతున్న వ్యక్తిపై పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపడం తగదన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణకు అడ్డుపడుతున్నందుకే అప్పలరాజుపై పీడీ యాక్టు నమోదు చేశారన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది పి సురేష్, ఐలు రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు.. అప్పలరాజుపై పీడీ యాక్టుకు వ్యతిరేకంగా న్యాయ పోరాటానికి సిద్ధమైనట్లు చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏలూరు జిల్లా, ఇనుమూరు గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఎస్ఐ, తహశీల్దారు గిరిజనేతర భూస్వాముల పక్షాన చేరి గిరిజనులపై దాడులు చేయడమే కాకుండా, గిరిజనులను అక్రమ అరెస్టులను చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

తక్షణమే గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ.. తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న జాయింట్ యాక్షన్ కమిటీలను సమన్వయం చేసుకుని ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పెద్దయెత్తున పోరాటం చేయాలని సూచించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్‌కెఎం నాయకులు చుండూరు రంగారావు, హరినాథ్, వై కేశవరావు, కెవివి ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు మరీదు ప్రసాద్, గిరిరాజు, అంద్ర మాల్యాద్రి, కొల్లాటి శ్రీనివాసరావు, శ్రీనివాస కుమారి తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్

సంక్షోభంలో సర్కారు విద్య

- ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం : యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకవర్గాలు సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ విమర్శించారు. ఆదివారం నంద్యాలలోని నేషనల్ పిజి కళాశాలలో యుటిఎఫ్ జిల్లా 4వ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ప్రారంభ సభ సందర్భంగా జాతీయ పతాకాన్ని పూర్వ గౌరవాధ్యక్షు డు నరసింహుడు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ పతాకాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్‌లు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభనుద్దేశించి కె.సురేష్ కుమార్ మాట్లాడారు. సంస్కరణల అమలు పేరుతో పాలకవర్గాలు ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే పాఠశాలల్లో నిరంతరం ఉపాధ్యాయుల బోధనా సమయాన్ని హరిస్తూ, బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నారని చెప్పారు. పాలకవర్గాలు విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చి వింతైన వినూత్న పద్ధతులలో నిరంతరం ఉపాధ్యాయులను వేధిస్తున్నారని ఆరోపించారు. పాలకుల విధానాల ఫలితంగా పేదవాడికి విద్య అందని ద్రాక్షాలా, అంగడి సరుకుగా మారిం దన్నారు. గుత్త పెట్టుబడిదారి సంస్థల అడుగులకు మడుగులొత్తుతూ విద్యను ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యమని పేర్కొంటూనే ప్రభుత్వ విద్యకు పాతరేస్తుందని దుయ్యబట్టారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక పేరుతో హడావిడి సృష్టిస్తూ సెలవులు లేకుండా చేసి ఇటు ఉపాధ్యాయులను, అటు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల పరీక్షలను, మూల్యాంకన విధానాన్ని ఒక ప్రహసనంగా మార్చివేసి గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.వి.ప్రసాద్, జె.సుధాకర్‌లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఇప్పుడు ఉద్యోగులను విస్మరించడం దుర్మార్గమన్నారు. 2002 జూలై నుండి 12వ పిఆర్సీని అమలు చేయాల్సినప్పటికీ, రెండున్నరేళ్లయినా దాని ఊసే లేదన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిల చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు కేవలం రూ.8,500 కోట్లు మాత్రమే చెల్లించారని, మిగిలిన రూ.30 వేల కోట్ల చెల్లింపులపై స్పష్టతే లేదన్నారు. సకాలంలో డిఎ చెల్లింపులు చేపట్టకపోతే ఉద్యోగులు ఎలా బతుకుతారంటూ ప్రతిపక్షంలో మొసలి కన్నీరు కార్చిన కూటమి నేతలు నేడు మూడు డీఏలను చెల్లించకుండా కాలయాపన చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఉద్యోగుల జీవన్మరణ సమస్య అయిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసే విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రకటించుకునే పాలకులు ఉద్యోగుల విషయంలో మొండిగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి ఉపాధ్యాయుల మెడపై టెట్ కత్తిని వేలాడదీయడం సబబు కాదన్నారు. సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయడంలో కాలయాపన చేయడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాలకవర్గాలు చిత్తశుద్ధి చూపకపోతే పోరాటాలతోనే సమాధానం చెబుతామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తుందని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయకుండా ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేసే కార్యక్రమాలను నిరంతరం రూపొందించి అమలు చేసే పనిలో ఉన్నారన్నారు. ఇలాంటి విధానాలను ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.సుబ్బారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు బి వై.సుబ్బారాయుడు, సహ అధ్యక్షుడు కె.సత్య ప్రకాశం, ఎం.ఐజయ్య, నాగ స్వామి నాయక్, ఏకె.సుజాత, ట్రెజరర్ బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యదర్శులు రామ్మోహన్, రామకృష్ణుడు, షమీంబాను, కిషోర్ కుమార్, ముర్తుజావలి, నరసింహా రెడ్డి, మహమ్మద్ ఖాసిం, నాగ చెన్నమ్మ, అరవింద్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ యు.దస్తగిరి పాల్గొన్నారు.

జాత్యాహంకార దాడులను ఖండించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

- ప్రపంచవ్యాప్తంగా మైనార్టీలపై దాడులకు నిరసనగా 'మౌన ప్రదర్శన'

ప్రజాశక్తి - నంద్యాల/కలెక్టరేట్

ప్రపంచ వ్యాప్తంగా జాత్యాహంకార దాడులు పెరిగిపోతున్నాయని, ఈ దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. భారత్, బంగ్లాదేశ్‌లలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు ఎదుర్కొంటున్న హింసాత్మక ఘటనలు, వేధింపులు, మౌలిక, మానవ హక్కుల ఉల్లంఘనలను నిరసిస్తూ నంద్యాలలోని గాంధీ చౌక్‌లో ముస్లిం జెఎసి, క్రిస్టియన్ జెఎసి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ ఐక్య వేదిక, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో 'మౌన ప్రదర్శన' చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్‌తోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ మైనార్టీలపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు వైఫల్యం చెందుతున్నారన్నారు. మైనారిటీల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపు చంద్రదాస పై జరిగిన దుర్మార్గాన్ని ఖండించారు. దేశవ్యాప్తంగా అక్లాఖ్ నుండి రామ్ నారాయణ భగేల్ వరకు ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీలు, దళితులు, బీసీలపై జరిగిన, జరుగుతున్న ఏకపక్ష దాడులు అమానుషమన్నారు. మానవ హక్కులు అందరికీ సమానంగా ఉండాలన్నారు. అన్యాయాలను ఎదుర్కోవడానికి ఐక్యంగా నిలబడాలన్నారు. శాంతిని కాపాడాలని, మతవైశమ్యాలను రూపుమాపాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో సామరస్యం, న్యాయం కోసం ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జెఏసి గౌరవాధ్యక్షులు ఎస్‌ఎండి.అబులైస్, కన్వీనర్ మౌలాన అబ్దుల్లా, జమాత్ ఇస్లాం హింద్ అబ్దుల్ సమద్, ట్రెజరర్ ఆడిటర్ బాష, క్రిస్టియన్ జేఏసీ పాస్టర్ జానయ్య మన్నెం, దైవ సహాయం, సిపిఎం పట్టణ కార్యదర్శి దర్శనం లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబ ఫక్రుద్దీన్, నాయకులు మురళీధర్, ఎస్‌డిపిఐ ఏజాజ్ హుస్సేన్, మజీద్‌ఖాన్, కాంగ్రెస్ చింతల మోహన్ రావు, మస్తాన్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అన్సర్ బాష, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కడియం సాంబశివుడు, లక్క భూషణం, బీసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రెడ్డిపల్లె ఓబయ్య, దళిత సంఘం దేవ భక్తుడు, వెజిటబుల్ మార్కెట్ అర్షద్, జకీఉల్లా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు రాధ, న్యాయవాది శ్రీనివాసులు, హఫీజ్ హబీబుల్లా, మోహన్ బాబు, ఖాజా మొహిద్దిన్, ఆనందరావు, బాలకృష్ణ, ఎస్‌పి హుస్సేన్, అబ్రహం, అబ్దుల్ సలాం, చంద్రపాల్, మాలి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుండి 'మీ ఇంటికి.. మీ డాక్టర్'

- చెంచు గిరిజన కుటుంబాలకు మొబైల్ హెల్త్ క్లినిక్ సేవలు

- వైద్యులు, నర్సులు, ఫార్మాసిస్టులు, డ్రైవర్ల పోస్టులకు ఆహ్వానం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని గూడేలలో నివసిస్తున్న నిరుపేద చెంచు గిరిజన కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 'మీ ఇంటికి మీ డాక్టర్' కార్యక్రమాన్ని 2026 ఫిబ్రవరి 1 నుండి ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు జి.రాజకుమారి తెలిపారు. ఆదివారం స్థానిక మీడియాతో కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో, న్యూఢిల్లీకి చెందిన రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో జిల్లాలో అమలు చేయనున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షులైన గవర్నర్ చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టును జిల్లాలో రూ.1.20 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చెంచు కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు మొబైల్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ సమన్వయంతో మొబైల్ హెల్త్ క్లినిక్స్‌ను నిర్వహించి ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ ప్రాజెక్ట పని చేస్తుందని పేర్కొన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించడం, సంక్రమణ వ్యాధుల నియంత్రణ, ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల్లో వంద శాతం టీకాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసర మైన వైద్య పర్యవేక్షణ అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వివరించారు. ఈ మొబైల్ హెల్త్ క్లినిక్ నిర్వహణ నిమిత్తం వైద్యులు, నర్సులు, ఫార్మాసిస్ట్, డ్రైవర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వైద్యుల పోస్టులకు ఎంబిబిఎస్, ఎండి పూర్తి చేసి ఉండాలని, నెల వారి వేతనం రూ.80 వేలు ఉంటుందని పేర్కొన్నారు. నర్సు పోస్టులకు జిఎన్‌ఎం, బిఎస్‌సి నర్సింగ్ అర్హత ఉండాలని, వేతనం రూ.25 వేలు, ఫార్మాసిస్ట్‌కు బీ.ఫార్మసీ డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేసి ఉండాలని, నెల వేతనం రూ.18 వేలు, డ్రైవర్ పోస్టులకు హెవీ వాహనాలు నడిపేందుకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, కనీసం ఐదేళ్ల అనుభవం తప్పనిసరి అని, వేతనం రూ.18 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో కూడిన దరఖాస్తులను redcrossnandyal@gmail.com, red-crossap@ gmail.com ఈమెయిల్ చిరునామాకు 2026 జనవరి 15లోపు పంపాలని పేర్కొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- 'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

- ప్రచార జాతాల్లో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నంద్యాల జిల్లాలో జీపు జాతాలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మూడు ప్రచార జాతాలు ప్రారంభమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాయి. ఆదివారం కోవెలకుంట్ల, డోన్‌లో జీపు ప్రచార జాతాలు ప్రారంభమయ్యాయి. కోవెలకుంట్లలో ప్రారంభమైన ప్రచార జాతాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎండి గౌస్, నంద్యాల పట్టణ కార్యదర్శి వెంకట లింగం, కోవెలకుంట్ల నాయకులు సుధాకర్ తదితరులు మాట్లాడారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం పెంచాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను ఫ్యాక్టరీ యజమానులకు బానిసలుగా మార్చే ప్రయత్నాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలన్నారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. డోన్ నుండి ప్రారంభమైన మరో జీపు జాతాను సిఐటియు సీనియర్ నాయకులు కొండయ్య ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు. అందులో భాగమే లేబర్ కోడ్‌లు అమలు చేస్తున్నారని విమర్శించారు. 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే యూపీఏ ప్రభుత్వంలో సాధించుకున్న మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చుతూ గాంధీ పేరు లేకుండా చేస్తూ తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ఈ జాతాను డోన్, ప్యాపిలి, జలదుర్గం వరకు సాగింది. రాత్రికి కొలిమిగుండ్లకు చేరుకోనుంది. అక్కడే రాత్రి బస చేసిన జీపు జాతా సోమవారం నుండి కొలిమిగుండ్ల, బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో సాగనుంది. కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాస్కర్ రెడ్డి, డోన్ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు నాగ మద్దయ్య పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో ప్రచార జాతాను ప్రారంభించిన మాట్లాడుతున్న నాయకులు

డోన్‌లో జీపు జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు సీనియర్ నాయకులు కొండయ్య

ఎస్ఆర్‌బిసి కాల్వలో దూకిన తల్లీబిడ్డలు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

ఎల్ల లక్ష్మి (ఫైల్)

ప్రజాశక్తి - గడివేముల : గడివేముల మండలం ఉండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానపల్లె ఎల్ల లక్ష్మి (23) తన కుమార్తెలు బుగ్గానిపల్లె వైష్ణవి (4), బుగ్గానిపల్లె సంగీత (3)తో కలిసి ఆదివారం మంచాలకట్ట గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఆర్‌బిసి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బుగ్గానిపల్లె ఎల్లలక్ష్మి అదే గ్రామానికి చెందిన రవణయ్యలు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలిసిన పోలీసులు ఎస్ఆర్‌బిసి కాలువ వద్ద చేరుకొని తల్లీ బిడ్డల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

నేడు కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్స్ నిర్వహణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించే ఒదుకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో 7 రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు హాజరై ప్రజలకు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. రెవెన్యూ, అడంగల్ సవరణలు, 22ఎ-చుక్కల భూముల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూములు-భూ ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు కేసులు, సర్వే-రీ సర్వే, దేవాదాయ-వక్ఫ్ భూముల సమస్యలకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజల అర్జీలకు వేగవంతమైన పరిష్కారం అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - సిరివెళ్ల : శిరివెళ్ల మండల కేంద్రంలోని డేగలపేటలో ఆదివారం జరిగిన రాష్ట్ర చరిత్ర అకాడమీ మాజీ డైరెక్టర్ డి.నూర్ హఫీజ్ వివాహ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి హాజరై నతూన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ ముజఫర్ హుస్సేన్, ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, దొర్నిపాటి జిక్రియ, సర్పంచ్ లక్కాకుల చంద్ర, వీరారెడ్డి పల్లె సర్పంచ్ మందాలశివారెడ్డి, దాదిరెడ్డి తిమ్మరాయుడు, ఉపసర్పంచి బసాపురం ఇంతియాజ్, దొర్నిపాటి ఇజాజ్, దొర్నిపాటి రఫీ, బీసీ నేత పసుల ప్రతాప్, వీరభద్రుడు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ నాయక్ జాఫర్ హుస్సేన్, ప్రముఖ జర్నలిస్టులు పాల్గొన్నారు.

పేదల పాలిట కల్పతరువు సిఎం రిలీఫ్ ఫండ్ : మంత్రి బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పేదల పాలిట కల్పతరువు ముఖ్యమంత్రి సహాయ నిధి అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 91 మంది లబ్ధిదారులకు రూ. 41 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంవత్సరన్నర కాలంలో నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయక నిధి ద్వారా 484 మంది లబ్ధిదారులకు రూ.3.78 కోట్ల ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద త్వరితగతిన లబ్ధిదారులకు సాయం అందేలా తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తోందని అన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి రాష్ట్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల పాలిట వరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ కొండంత భరోసానిస్తోందన్నారు. నిరుపేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుందన్నారు. అనంతరం వైద్య సహాయం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని, వారి యోగ క్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కూటమి పాలనలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై లబ్ధిదారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

భూపేసిరెడ్డిని సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

టిడిపి కడప జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్ రెడ్డి నివాసంలో కడప జిల్లా అధ్యక్షుడు చదివిరాళ్ల భూపేసిరెడ్డిని మాల మహానాడు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు ఆయనను కోరారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, మాల మహానాడు జిల్లా కార్యదర్శి కే.శివుడు, నాయకులు మేకల భాస్కర్ పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి ప్రాధాన్యత : ఎంపీ బైరెడ్డి శబరి

- రజక ఆకాంక్ష సభ-5 విజయవంతం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రజకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ కృషి చేస్తుందని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా రజక సేవా సంఘాల ఆధ్వర్యంలో రజక ఆకాంక్ష సభ-5 ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక సంజీవనగర్ నుంచి ఆర్కే ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బైరెడ్డి శబరి, టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రజకులకు మొట్టమొదటిసారి హైదరాబాదులో దోబీ ఘాట్లు నిర్మించిన ఘనత టిడిపి వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకే దక్కిందని గుర్తు చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో దోబీఘాట్ల నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రజకులు అన్ని రంగాలలో రాణించేలా చైతన్య పరుస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజకుల ఐక్యతను చాటుతూ ఆకాంక్ష సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఐదవ సభను నంద్యాలలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, చంద్రశేఖర్, సతీష్ కుమార్, దుర్గారావు, చంద్ర, ఎపిఎస్ఎస్‌సిఎ బోర్డు మెంబర్ మంజీరా సీడ్స్ అధినేత రామ మద్దిలేటి, రజక సంఘం కర్నూలు జిల్లా సీనియర్ నాయకులు వాడల నాగరాజు, మధు, గోల్డ్ శీను, లాయర్లు లోకేష్, చంద్రశేఖర్, నంద్యాల జిల్లా సేవా సంఘం గౌరవ సలహాదారులు సుకుమాంబ కుమారి, అధ్యక్షుడు కొర్రపోలురు నాగరాజు, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, గౌరవ సలహాదారులు వెంకటేశ్వర్లు, రైల్వే శ్రీనివాసులు, శ్రీశైల దేవస్థాన కోశాధికారి గోపాల్, పాములపాడు సొసైటీ చైర్మన్ గోవింద్, వివేకానంద స్కూల్ కరెస్పాండెంట్ గోపాల్, వేల్పనూరు నాగన్న, బస్తిపాటి మౌలాలి, రాము, అవుకు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి



స్వామి వారి సన్నిధిలో ఎస్ఐ దంపతులు

కొత్తూరు ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కొత్తూరు సుబ్బరాయుడు స్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి దగ్గరగా ఉండడం, అలాగే ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. పాణ్యం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, ఆయన సతీమణి కర్నూలు జిల్లా మహిళా స్టేషన్ సీఐ విజయలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో రామకృష్ణ, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

- ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు

ప్రజాశక్తి - శిరివెళ్ల

ప్రైవేట్, కార్పొరేట్ వైద్య సేవలకు ధీటుగా ప్రభుత్వ వైద్యశాలలో వసతులు, వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని శిరివెళ్ల ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. వైద్యశాలలో అత్యాధునిక పరికరాలు, ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఓపీ భారీగా పెరిగిందన్నారు. మెడికల్ ల్యాబ్ పరీక్షలు పైసా ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా చేస్తున్నామన్నారు. లక్షల్లో ఖర్చయ్యే ఆపరేషన్లు జిల్లా వైద్య కేంద్రాలలో జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఆర్థిక భారం పడకుండా వైద్య సేవలను ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. జిల్లా వైద్యకేంద్రాలలో అత్యాధునిక వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేసి కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల వారు ప్రభుత్వ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న డాక్టర్ రామాంజనేయులు

ఆలయాన్ని దర్శించుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఎఇఒ మధు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్తీర్ణత పెంచేందుకు ప్రత్యేక కృషి : ఎంఇఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎంఇఒ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తపల్లి, దుద్యాల, గోకవరం, ముసలిమడుగు, కేజీబీవి, శివపురం, ఆశ్రమపాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని చెప్పారు. అందుకు గాను ప్రత్యేక అధికారులను నియమించినట్లు వెల్లడించారు. దుద్యాల జెడ్పిహెచ్ఎస్‌కు ఎంపిడిఒ దాసరి మేరి, కొత్తపల్లి హైస్కూల్కు పశువైద్యాధికారి అశోక్ కుమార్, గోకవరం జెడ్పిహెచ్ఎస్‌కు ఎర్రమఠం వైద్యాధికారి జబ్బీర్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించామని తెలిపారు. అదేవిధంగా ముసలిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎఒ అమిరున్నీసాబేగం, కొత్తపల్లి కేజీబీవికి తహశీల్దార్ ఉమారాణి, శివపురం హైస్కూలుకు ఇఒఆర్‌డి సుబ్బారావు, పాలెంచెరువు గిరిజన ఆశ్రమ పాఠశాలకు మండల ప్రత్యేక అధికారి చింతామణిలను ప్రత్యేక అధికారులుగా నియమించామని చెప్పారు. వీరి పర్యవేక్షణలో పదో తరగతి విద్యార్థులలో మంచి విద్యాపాఠవాలను గుర్తించి విద్యా లక్ష్యాలను చేరుకొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వృథాగా పోతున్న తాగునీరు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని రామభద్రునిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ట్యాంక్ నుంచి గ్రామానికి నీటి సరఫరా కొనసాగుతోంది. ట్యాంక్ నీళ్లు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ట్యాంక్‌కు నీళ్లు వదులుతారు కానీ.. నిండిన తర్వాత ఆఫ్ చేయడం లేదని గ్రామస్తులు రాముడు, వెంకటేశ్వర్లు తెలిపారు. సంబంధిత అధికారులు నీటి వృథాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతిరోజూ ఇలానే వృథా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఆవుల చిన్న పుల్లన్న(65) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి ఆదివారం మృతుని స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించి, దహన సంస్కారాలకు రూ. 5వేలు అందజేశారు.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం గుటిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఉద్దాల నాగేశ్వరరావు కొడుకు నాగకృష్ణ(30) వారం రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి మృతుడి భౌతికకాయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. వారు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు, నాయకులకు, కుటుంబాలకు వైయస్సార్ పార్టీ ఎప్పుడు అండగా ఉండి ఆదరిస్తారని భరోసా ఇచ్చారు. నివాళ్లర్పించిన వారిలో సర్పంచి శ్రీరాములు, మద్దిలేటి స్వామి, మాజీ చైర్మన్ సీతా రామచంద్రుడు, రంగస్వామి పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్ : సిఐ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పేకాట ఆడుతున్న 13మందిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ. 2,600లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలం పరిధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో వెటర్నరీ హాస్పిటల్ దగ్గర పేకాట ఆడుతున్న ఆరు మందిని అరెస్టు చేసి వారివద్ద ఉన్న రూ.1,100 స్వాధీనం చేసుకొని పేకాట కేసు నమోదు చేశామన్నారు. ఇటిక్యాల గ్రామంలో పెద్దమ్మ గుడి ఎదురుగా ఉన్న లేబర్ ఫ్యాక్టరీలో పేకాట ఆడుతున్న 7 మందిని అరెస్ట్ చేసి వారివద్ద ఉన్న రూ. 1,500 స్వాధీనం చేసుకొని 7 మందిపై పేకాట కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం

- తెలుగు యువత మండలాధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

సిఎం సహాయక నిధి పేద ప్రజలకు వరం లాంటిదని తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలంలోని పెట్నీకోట గ్రామంలో సిఎం సహాయక నిధి చెక్కును బాధిత రామేశ్వరి కుటుంబ సభ్యులకు ఆయన ఆదివారం అందజేశారు. హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ సిఎం సహాయక నిధి ద్వారా ఎంతో మంది పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిరుపేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వంలో కొండంత అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్యంపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.అలాగే.. ఇటిక్యాల గ్రామానికి చెందిన సారెడ్డి శంకర్ రెడ్డికి రూ. 20,500వేలు, ఎట్టమల బాల వెంకటకు రూ. 20,800వేల సిఎంఆర్ఎఫ్ చెక్కులను టిడిపి నాయకుడు తోట శివారెడ్డి అందజేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎలాంటి ఆపద సంభవించినా నేనున్నాను అనే ధైర్యాన్ని నింపుతూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, భద్రతలపై కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అభిప్రాయపడ్డారు. చెక్కులను అందజేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న తెలుగు యువత మండలాధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి

సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న టిడిపి నాయకుడు తోట శివారెడ్డి

హలో కార్మికా.. చలో విశాఖ

ప్రజాశక్తి - ప్యాపిలి

విశాఖపట్టణంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే 18వ. అఖిల భారత మహాసభల సందర్భంగా హలో కార్మికా.. చలో విశాఖ అంటూ డోన్ పట్టణం నుండి బయల్దేరిన సిఐటియు జీపుజాతాను సీనియర్ నాయకులు జి. కొండయ్య బేతంచెర్ల సర్కిల్ సిఐటియు కార్యాలయం దగ్గర ఆ సంఘం జెండాను ఊపి ఆదివారం ప్రారంభించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి టి. శివరాం, సీనియర్ నాయకులు పి. రామాంజనేయులు, మండల కన్వీనర్ ఎవి. భాస్కర్ రెడ్డి, కో-కన్వీనర్ బి. నాగమద్దయ్య పట్టణ ఉపాధ్యక్షులు నక్కీ శ్రీకాంత్‌లు మాట్లాడారు. జనవరి 4న విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో భారీ ఎత్తున బహిరంగ సభ ఉంటుందన్నారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, మేధావులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ప్రచార జాత ప్యాపిలి మండలానికి బయలుదేరి వెళ్ళింది. కార్యక్రమంజలో నాయకులు బాబయ్య, ఎర్రన్న, రామబుగ్గడు, రామాంజి, బాబు, బాలు, సుబ్బయ్య, తిరుపాలు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం : మాట్లాడుతున్న భాస్కర్

కోవెలకుంట్ల : విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు చైతన్య జీపు జాత కోయిలకుంట్ల పట్టణానికి వచ్చిన సందర్భంగా గ్రామ పంచాయతీ వద్ద సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి గౌస్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే అఖిల భారత మహాసభను అందరు కలిసి జయప్రదం చేద్దామని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, వెంకట లింగం, సుబ్బారావు, జైలాం, వెంకట్రావు, బుజ్జి, కిరణ్, రఘు, మురళీ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాణ్యం : విశాఖపట్నంలో ఈనెల 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు ఎండి గౌస్, వెంకటలింగం ప్రజలను కోరారు. పాణ్యంలోని మెయిన్ బజార్‌లో సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో జీపుజాతా కార్యక్రమం నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు. కార్మిక చట్టాలకు తిలోదకాలు ఇస్తూ లేబర్ కోడ్‌లను బలవంతంగా కార్మికులపై రుద్దే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఈ సభల ద్వారా హెచ్చరికలు పంపుతూ ప్రజలు స్వచ్ఛందంగా విశాఖకు తరలిరావాలని వారు కోరారు.

అడుగేయకుండా.. అన్నీ ఇంటికే.!

- అన్ని వస్తువులూ ఆన్‌లైన్‌లోనే కొనుగోళ్లు

- పల్లెకు పాకిన సంస్కృతి - ఆదరణ కోల్పోతున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి - పాములపాడు

నేటి డిజిటల్ యుగంలో నగరాలు, మహానగరాలు, కాస్మోపాలిటన్ సిటీస్ మొదలుకొని గ్రామాల వరకు అందరూ ఆన్‌లైన్ షాపింగ్ వైపే మొగ్గు చూపుతున్నారు. ఏది కావాలన్నా సరే ఫోన్లో ఒక్క క్లిక్ కొట్టి ఇంటికి రప్పించుకుంటున్నారు. అనేక ఈ-కామర్స్ సంస్థలు సేవలను అందిస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ షాపింగ్‌పై తాజాగా కేంద్ర గణాంకాల శాఖ ఈ ఏడాది జనవరి-మార్చి మధ్యలో 'కాంప్రహెన్సివ్ మాడ్యులర్ సర్వే, టెలికామ్-2025' పేరుతో ఆన్లైన్ కొనుగోళ్లపై చేసిన సర్వేలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 24.5శాతం కుటుంబాలు ఆన్‌లైన్‌నే కొనుగోళ్లుచేస్తున్నట్లు తేల్చింది.

పట్టణాలు, పల్లెలు అన్నా తేడా లేకుండా ఆన్‌లైన్ విధానంలో వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. చేతిలో సెల్ పోన్ ఉండాలే కానీ అరచేతిలో వైకుంఠంలా క్షణాల్లో తమకు నచ్చిన, మెచ్చిన వస్తువులు, కిరాణా, ఆహారం, దుస్తులు కాస్మెటిక్స్ వాణిజ్య పరమైన ఇతరత్రా సామగ్రిని ఇంటి దగ్గరికి తెప్పించుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతి ప్రస్తుతం పల్లెలకు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ప్రజలు ఆన్‌లైన్ వస్తువులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఆన్‌లైన్ వ్యాపారాల పుణ్యమా అని స్థానిక చిరు వ్యాపారాలు మూతపడ్డాయి.

యువతకు ఉపాధి..

ప్రస్తుతం పట్టణాలు, నగరాల్లో అమేజాన్, మీషో, ఫ్లిప్‌కార్ట్ తదితర చాలా సంస్థలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వాటితో నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో ఈ కామర్స్ సంస్థల్లో చేరి వాటి పనుల్లో బిజీగా జీవితాన్ని గడుపుతున్నారు. సంస్థల్లో సగటు ఉద్యోగికి రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకూ జీతం ఉండేది. ఇప్పుడు రూ.25 వేలకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ఎస్ ముర్తు జావలి, కో-అప్డేట్ మెంబర్

తగ్గిపోతున్న దుకాణాలు

ఆన్‌లైన్ వ్యాపారాల మూలంగానే ఇండియన్ రిటైల్ రంగంలో కిరాణా దుకాణాలతోపాటు ప్రజలకు అవసరమైన వస్తువులు విక్రయించే కిరాణం షాప్‌ల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని జాతీయ సంస్థలు అంచనాలను వెల్లడిస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఆన్‌లైన్ సంస్థలు 1500 శాతం వృద్ధి సాధిస్తాయని చెప్పడం బట్టి అర్థమవుతోంది. ఇప్పటివరకూ ఉన్న కిరాణం షాపులు చిన్న దుకాణాలు అన్నీ మూతపడుతున్నాయి. రానురానూ వాటి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

– మేకల రాజు, సిఐటియు మండల కార్యదర్శి

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

నేటి సమాజంలో ఆన్‌లైన్ మోసాలతోపాటు సైబర్ క్రైమ్‌లపై జాగ్రత్త ఉండాలని సైబర్ క్రైమ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ వస్తువులను కొనేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని, అనవసరమైన వాటికి జోలికి పోకూడదని నిపుణులు పేర్కొంటున్నారు. రోజురోజుకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్స్ పెరిగిపోతున్నాయి. వినియోగదారులు, యువత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసిన సందర్భంలో వస్తువుల బదులు కొబ్బరి పీచులు, చిన్నచిన్న గులకరాళ్లు వంటివి వస్తున్నాయి. వాటిపట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.

కలబండి నాగరాజు, సోషల్ వర్కర్

అప్పలరాజుపై పిడి యాక్ట్‌ను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు అన్నారు. నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో కె. మద్దిలేటి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణిచివేసేందుకు పిడి యాక్ట్ కేసును బనాయిస్తుందని అన్నారు. రౌడీలు, గుండాలు, డ్రగ్స్, అత్యాచారాలు, హత్యలు, కిడ్నాపర్లపై పెట్టే కేసులను నిరంతరం ప్రజా ఉద్యమాలు చేసే సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజుపై పెట్టడం దుర్మార్గమన్నారు. అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను వెంటనే రద్దు చేసి ఆయనను వెంటనే విడుదల చేయాలని, లేని ఎడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనకాపల్లి మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, మత్స్య కార్మికులు చేస్తున్న ఉద్యమానికి అండగా నిలిచిన అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న అప్పలరాజుపై 19 కేసులు పెట్టారని తెలిపారు. అందులో ఇప్పటికే 13 కేసులు కోర్టు కొట్టు వేసిందన్నారు. సిఎం చంద్రబాబుపై 26 కేసులు ఉన్నాయని, రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపిలపైన 60 శాతం మంది ప్రజాప్రతినిధులపైన అనేక కేసులు ఉన్నాయన్నారు. అలాంటి వారిపై పిడి యాక్ట్ పెట్టి వారిని కూడా జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. అనకాపల్లిలో ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌ను స్థానిక మత్స్య కార్మికులు, ప్రజలు వ్యతిరేకించారని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, సి. నాగన్న, కె. తారేష్, కె. ఆంజనేయులు, నాగేంద్ర, రంగస్వామి, రమణ, బజారు, కందన పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు

వైభవంగా స్వామి అమ్మవార్లకు పల్లకి ఉత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం దేవస్థానంలో లోక కల్యాణం కోసం శ్రీస్వామి అమ్మవార్లకు ఆదివారం పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠించి మహాగణపతిపూజ నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో వేంచేబుచేయించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

రద్దీగా మారిన మల్లన్న క్షేత్రం..

వరుస సెలవులు కావడంతో శ్రీశైల క్షేత్రం భక్తజనంతో రద్దీగా మారింది. తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి యాత్రికులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీ స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాలు, క్షేత్ర ప్రధాన వీధులు కళకళలాడుతున్నాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ వేళల్లో దేవస్థానం అధికారులు మార్పులు చేశారు. తెల్లవారుజామున 3:30 నిమిషాలకు మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవ, ప్రాతఃకాల సేవ పూజ, మహా మంగళ హారతి సేవలు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామి అమ్మ వార్ల దర్శనానికి వీలు కల్పిస్తున్నారు. అలాగే తెల్లవారుజాము నుంచి ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర, దర్శన క్యూలైన్లు, ఆర్జిత సేవా క్యూలైన్లు నిండిపోయాయి. అలాగే దర్శనాలు, ఆర్జిత సేవలల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు క్యూ లైన్లను నిర్ణీత సమయాన్ని అనుసరించి నిర్వహిస్తున్నారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఉభయ దేవాలయాల నిర్వహణలో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం అన్నదాన మందిరంలో మహా ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. క్షేత్రంలో సెలవు దినముల్లో సుమారు 50 నుండి 60 వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు అంచనా. క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ ఇఒ శ్రీనివాసరావు క్షేత్రంలో పర్యవేక్షిస్తూ విభాగాధికారులకు సూచనలు, సలహాలు ఇస్తూ.. అప్రమత్తం చేస్తున్నారు.

అన్న ప్రసాద వితరణ పథకానికి విరాళం...

విశాఖపట్టణంకు చెందిన ధాత ఎ శిరీష్ కుమార్ అన్నదాతన వితరణ పథకానికి రూ.1.117లక్షను ఆలయ పర్యవేక్షులు కె. అయ్యన్నకు ఆదివారం అందజేశారు. ధాతకు ఆయన తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెవివి నాయకులు

మద్యానికి వ్యతిరేకంగా.. జెవివి కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం వినియోగం ఆనందమా, అనర్థమా, నూతన సంవత్సరాన్ని మద్యం మత్తుతో స్వాగతించాలా లేదా ఆరోగ్యం ఆనందం కుటుంబంతో స్వాగతించాలా అన్న విషయంపై కరపత్రాలు ముద్రించి నంద్యాల జనవిజ్ఞాన వేదిక మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా నగర్‌లోని భగత్ సింగ్ కూడలిలో జెవివి నాయకులు ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి పి గోపాల్ మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరాన్ని మద్యం లేని వేడుకలతో కుటుంబ సభ్యులతో కలిసి మిఠాయిలతో స్వాగతం పలికితే అదే నిజమైన ఆనందం అవుతుందన్నారు. జెవివి ట్రెజరర్ రమణ మాట్లాడుతూ నేడు మీరు కంటిపాపలుగా చూసుకుంటున్న మీ వారసులు రేపు మిమ్మల్ని కంటతడి పెట్టించకుండా ఉండాలంటే డిసెంబర్ 31 రాత్రి ఎలాంటి బార్లకు, పబ్బులకు, మందు పార్టీలకు వెళ్లకుండా సూచించండని తల్లిదండ్రులను అభ్యర్థించారు. అది మన కనీస బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు శంకరయ్య, జెవివి నాయకులు చిన్నయ్య, కాజా మొయిద్దీన్, లతీఫ్, రామరాజు, పునీత్ పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు.. ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి దర్శనం అనంతరం ముక్కోటి ఏకాదశి నేటి నుంచి 31 వరకు నిర్వహిస్తున్న సందర్భంగా ఆలయ పరీక్షల ప్రాంతాలను ఎమ్మెల్యే కోట్ల పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని ఇఒ, కమిషనర్ రామాంజనేయులు, ఆలయ అధికారులతో చర్చించారు. ఆలయ అర్చకులు, ఇఒ కమిషనర్ రామాంజనేయులు ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించేలా సౌకర్యం కల్పించి తీర్థ ప్రసాదాలు స్వామివారి చిత్రపటాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు, ప్రజలకు స్వామివారి ఆశీస్సులు పొందేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. సోమవారం నుండి జరగబోతున్న వృషభరాజముల బండలాగుడు, కబ్బడి ఇతర పోటీల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ అసౌకర్యం కలగకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కార్యకర్తలే పార్టీకి అధినేతలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

కార్యకర్తలే టిడిపి పార్టీకి అధినేతలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. వేల్పనూరులోని తన స్వగృహంలో ఎమ్మెల్యే ఉత్తమ కార్యకర్తల సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 18 నెలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి క్షేత్ర స్థాయికెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించి, పార్టీ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని అభినందించి అవార్డులు అందజేసి సత్కరించారు. అభివృద్ధిని విస్మరించి, శవరాజకీయలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైయస్ జగన్ ఏనాడూ సొంత కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. కార్యకర్తే అధినేత అని ప్రకటించిన పార్టీ తెలుగు దేశం మాత్రమే అన్నారు. వైసీపీ ఫేక్ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు.

మీ సేవా జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర మీసేవా నూతన కమిటీ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా మీసేవా మిత్రులందరూ కలిసి నంద్యాల జిల్లా మీ సేవా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం. కృష్ణుడు, వైస్ ప్రెసిడెంట్‌గా కెవి శ్రీరాములు, సెక్రటరీగా ఇంతియాజ్, సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీగా మనోహర్, షఫీ, ట్రెజరర్‌గా చంద్రశేఖర్, ఇసి మెంబెర్స్‌గా బద్రీనాథ్, జగన్నాథరెడ్డి, సుధాకర్, మహమ్మద్ రఫీ, నాగన్న, స్టేట్ కమిటీ సభ్యులుగా శంకర్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నూతన రాష్ట్ర మీసేవా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాము, జనరల్ సెక్రటరీ సురేష్, ట్రెజరర్ రమణారావు, యాసిన్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో పతకం సాధించాలి

- రాష్ట్ర సపక్ తక్రా సంఘం ఉపాధ్యక్షులు బి. శ్రీధర్

క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న బద్దుల శ్రీధర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

జాతీయస్థాయిలో పథకం సాధించాలని రాష్ట్ర సపక్ తక్రా సంఘం ఉపాధ్యక్షులు బద్దుల శ్రీధర్ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణంలోని శ్రీ నవనంది పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహిస్తున్న జూనియర్ జాతీయ స్థాయి క్రీడాకారుల శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంజాబ్ లోని పగ్వారాలో జనవరి 1 నుండి 5 వరకు జరగనున్న జూనియర్ జాతీయస్థాయి క్రీడాకారులు పాల్గొని జాతీయస్థాయిలో రాష్ట్రానికి మంచి పేరును తీసుకొని రావాలని పథకాన్ని సాధించి పెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం బద్దుల శ్రీధర్ చేతుల మీదుగా రాష్ట్ర జట్టుకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. శిక్షణ శిబిరానికి సంపూర్ణ సహకారం అందించిన శ్రీ నవనంది పాఠశాల వ్యవస్థాపకులు అదేవిధంగా రాష్ట్ర సపక్ తక్రా సంఘం ఉపాధ్యక్షులు శ్రీధర్‌కు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల వినతులను స్వీకరిస్తున్న ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించాలి : మంత్రి

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజల నుంచి వచ్చిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించి త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి పలు అర్జీలను మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చౌడేశ్వరి దేవి దేవస్థానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానానికి కడప పట్టణానికి చెందిన గుర్రం గంగయ్య కుమారుడు గుర్రం కమలాకర్, ఆయన సతీమణి రమాదేవి, కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ పివి.నాగార్జున రెడ్డి, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు ఆదివారం అందజేశారు.

30న వైకుంఠ ఏకాదశి వేడుకలు

వైకుంఠ ఏకాదశి పూజలకు ముస్తాబైన శ్రీ వాసాపురం దేవస్థానం

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని కొండమాయపల్లి పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదాదేవి సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం రాత్రి 12 గంటలకు స్వామికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు, ప్రత్యేక అలంకరణ ఉత్తర ద్వారం నుంచి ప్రత్యేక పూజ అనంతరం దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 10 గంటలకు కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత దీవీ హయగ్రీవాచార్యులు వారిచే ప్రవచనాలు, మధ్యాహ్నం 1 గంటకు కోలాట కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతులు కల్పించినట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు : ఇఒ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో వెలసిన లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30న జరిగే వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈవో సాయి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు మామిడి కిషోర్ శర్మ, సాయిశర్మ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజు భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పల్లకీతో గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. మద్దూరు గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని 500 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఉత్తర ముఖద్వారంతో నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణ దేవరాయలు నల్లమల అడవి గుండా శ్రీశైలం నుంచి అహోబిలం వచ్చి అక్కడి నుంచి వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వెళ్తూ మార్గమధ్యలో మద్దూరు గ్రామంలో బస చేసినట్లు సమాచారం.

విశ్వబ్రాహ్మణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండల విశ్వబ్రాహ్మణ కమిటీని చంద్రమౌళి ఆచారి నంద్యాల రాజేష్ కుమార్ ఆచారి కోవెలకుంట్ల శ్రీనివాస ఆచారి బనగానపల్లి శివరంగ ఆచారి అవుకు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రసాదాచారి, ఉపాధ్యక్షులుగా జనార్ధనచారి, సూర్యచంద్రచారి, గౌరవాధ్యక్షులుగా వీరాచారి, రాఘవాచారి, రామసుబ్బయ్యచారి, శ్రీనివాస్ ఆచారి, ప్రధాన కార్యదర్శిగా ఆనందాచారి, ఉప కార్యదర్శిగా కృష్ణమోనాచారి, కోశాధికారిగా సురేష్ ఆచారి, సభ్యులుగా సుబ్బరాముడు ఆచారి, శంకరాచారి, వేణుగోపాల చారి, బాలాజీ కుమార్ ఆచారిలను ఎన్నుకున్నారు. అధ్యక్షులు ప్రసాద్ ఆచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సమస్యలపై కమిటీ వారితో చర్చించి ఒకరోజు ఆలస్యమైన పరిష్కారం అయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అక్షరాల అమృతధార తెలుగు భాష

- సమితి అధ్యక్షులు డాక్టర్ దీవిహయగ్రీవా చార్యులు

ప్రజాశక్తి - నంద్యాల

అక్షరాల అమృతధార తెలుగు భాష అని మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ దీవిహయగ్రీవా చార్యులు పేర్కొన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని, సంస్కృతి పరిమళాన్ని, సాహిత్య సంపదను నేటి తరానికి అందించాలన్న సంకల్పంతో ఏర్పాటైన మాతృభాషా పరిరక్షణ సమితి 20వ (వింశతి) వార్షికోత్సవం నంద్యాల పట్టణంలోని శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షులు డాక్టర్ దీవిహయగ్రీవా చార్యులు మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించడానికి, తెలుగు సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టడానికి, తెలుగు కళారూపాలను కాపాడటానికి తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. జీవన వ్యవహారాల్లో తెలుగు వినియోగాన్ని పెంపొందించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ముఖ్య అతిథులు చంద్రశేఖర కల్కూర, జెఎస్ఆర్ కె. శర్మలు మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వికాసాలకు మనమంతా కృషి చేయాలని భవిష్యత్ వారసులైన పిల్లలు, యువతరం తెలుగు భాష పట్ల ఆత్మీయతను పెంచుకోవాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దేశం సులోచన మాట్లాడుతూ జ్ఞానానికి పునాది మాతృభాష అని, అమ్మభాషా వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ జాతి అభివృద్ధి భాషా వికాసంతో ముడిపడి ఉంటుందని, 20ఏళ్లుగా మాతృభాషా పరిరక్షణ సమితి అనేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి రెండు దశాబ్దాలుగా పుస్తకావిష్కరణలు, అష్టావధానాలు, సాహితీ సదస్సులు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నంది రైతు సమాఖ్య, మాతృభాషా పరిరక్షణ సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలుకు చెందిన సాహితీవేత్త జెఎస్ఆర్ కె. శర్మ రచించిన 'రాయలసీమ కావ్య సముద్ర మథనం' 'పింగళి సూరన సాహితీ వైభవం' పుస్తకాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ప్రధాన కార్యదర్శి దండెబోయిన పార్వతి 'పింగళి సూరన సాహితీ వైభవం' పుస్తకాన్ని సమీక్షిస్తూ సాహితీ ప్రతిభామూర్తి, అష్టదిగ్గజ కవులలో ఒకరైన పింగళి సూరన కవితా వైభవాన్ని, రచనా పటిమను పుస్తక రచయిత శర్మ అద్భుతరీతిలో వర్ణించారన్నారు. పుస్తకాన్ని ప్రముఖ నేత్రవైద్యులు ఎన్‌సి లక్ష్మయ్యకు అంకితమివ్వడం సంతోషకరమన్నారు. మరో పుస్తకం 'రాయలసీమ కావ్య సముద్ర మథనము'ను డాక్టర్ కర్నాటి చంద్రమౌళి సమీక్షించారు. శ్రీశైల పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు నిర్వహించిన మాతృభాష ఔన్నత్యాన్ని తెలిపే సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ కిశోర్ కుమార్, అవ్వారి శేషఫణి, వసుంధర, విజయదుర్గ, ఎం. శ్రీనివాసమూర్తి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, గోళ్ళ సుదర్శనం, మురళీనాథరెడ్డి, మురళీకృష్ణారావు, ఓబుళపతి, కన్నయ్య, నందిరైతు సమాఖ్య అధ్యక్షులు బెక్కెం రామసుబ్బారెడ్డి, సమాఖ్య ప్రతినిధులు కొండా మోహన్ రెడ్డి, కష్టారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ కల్కూర

ఆధునిక మార్పులపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

- ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల

వివిధ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో వస్తున్న ఆధునిక మార్పులపై వైద్యులు నిరంతరం వారి పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అన్నారు. భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులతో 'బాలల వైద్యంలో ఆధునిక విధానాలు' పేరిట నిరంతర వైద్య విద్యా సదస్సు మధుమణి ఆస్పత్రి సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. నంద్యాల ఐఎంఎ అధ్యక్షులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సు ప్రారంభోత్సవంలో ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడారు. వివిధ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో వస్తున్న ఆధునిక మార్పులపై వైద్యులు నిరంతరం వారి పరిజ్ఞానాన్ని పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. సదస్సులో ప్రసంగిస్తున్న హైదరాబాద్ రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు నలుగురు మహిళలు కావడం విశేషమని, వైద్య రంగంలో పెరుగుతున్న మహిళల పాత్రకు ఇది నిదర్శనం అన్నారు. సదస్సులో 'బాలల్లో న్యూరో సర్జరీ చికిత్సలు' అంశంపై న్యూరో సర్జన్ డాక్టర్ విశాఖ బసవరాజ్, 'బాలలలో నాళ రహిత గ్రంథుల్లో వచ్చే జబ్బులపై' ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జక్కిడి లీనాద మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా ప్రసంగించారు. తదుపరి 'బాలలలో న్యూరాలజీ అత్యవసర చికిత్సలపై' క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎర్రా అనుపమ సమన్వయకర్తగా నిర్వహించిన చర్చలో న్యూరాలజిస్ట్ డాక్టర్ బండి రమ్య, నంద్యాల చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నయన్ బాబా పాల్గొని చిన్న పిల్లలలో నరాలు, మెదడుకు సంబంధించిన జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించి సరైన చికిత్స అందించడం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎంఎ నంద్యాల పూర్వ అధ్యక్షులు డాక్టర్ మధు సూదనరావు, డాక్టర్ సహదేవుడు, రాష్ట్ర ఐఎంఎ సంయుక్త కార్యదర్శి డాక్టర్ అనీల్ కుమార్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, నంద్యాల ఐఎంఎ కో-శాధికారి డాక్టర్ హరిత, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనీల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల వ్యవహారంపై..

వ్యాపారస్తులకు నిద్ర పట్టడం లేదు : వైసిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

మెడికల్ కాలేజీల వ్యవహారంపై వ్యాపారస్తుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చిప్పగిరి మండల వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య అన్నారు. మండలంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను కొనేందుకు వ్యాపారస్తులు సిద్ధమైన నేపథ్యంలో ఇప్పుడు నిద్ర పట్టడం లేదన్నారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి మాట శిలా శాసనమని, మాట ఇస్తే తప్పని వ్యక్తి అన్నారు. జగన్మోహన్ రెడ్డి పట్టుదల ఎలాంటిదో ప్రజలందరికీ తెలుసుని, ఆయన అనుకుంటే ఏదైనా సాధించే సత్త కలవాడన్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీల వ్యాపారస్తులు పెద్ద అయోమయంలో ఉన్నారన్నారు. చేతిలో ఇన్వెస్ట్‌మెంట్ పేపర్లు పట్టుకుని రావాలా లేక ముందస్తు బెయిల్ పేపర్లు పట్టుకుని తిరగాలా అని తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏమో "పెట్టుబడులు పెట్టండి బాబూ" అని పిలుస్తుంటే, వీళ్ళు మాత్రం "ముందు ఆ జైలు గదులకు తాళాలు వేయండి బాబూ, అప్పుడైనా కొంచెం ధైర్యంగా వస్తాం" అని పారిపోతున్నారన్నారు.



మాట్లాడుతున్న వైసిపి మండల కన్వీనర్ మారయ్య

ఖురాన్ కంఠస్థ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అబ్దుల్ సమద్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల అంటి కోట మస్జిద్‌లో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడిస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఖుర్ఆన్ కంఠస్థ ప్రతిభా పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జమాతే ఇస్లామీ హింద్ నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్ పిల్లలను అభినందించారు. విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంపొందించుటకు, క్రమశిక్షణకు ఈ పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని సమద్ తెలిపారు. క్యూఎఫ్ఆర్ నంద్యాల జిల్లా కన్వీనర్ హాఫీజ్ షోయబ్ జమా అధ్యక్షతన జరిగిన పోటీలలో హాఫీజ్ హఫిజుర్రహమాన్, మౌలానా హుసేన్, మౌలానా ముజీబ్ ఉమ్రీ పోటీలు పర్యవేక్షించారు. ఖుర్ఆన్ కంఠస్థ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు మెమోంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. సెమీ ఫైనల్‌కు నంద్యాల నుండి పది మంది పిల్లలు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుల్ హాది, హాఫీజ్ వాహెద్, హాఫీజ్ ఇసాక్, మౌలానా అబ్దుల్లా, సయ్యద్ జమీలుద్దీన్, జనాబ్ జకరియా, మహబుబ్, సాజిద్, ఇందాదుల్లాహ్, నవాజ్ ఖాన్, విద్యార్థుల తల్లితండ్రులు, స్కూల్ కరెస్పాండెన్స్ పాల్గొన్నారు.

సమస్యల్లో ఆర్‌టిసి బస్టాండ్

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. బస్టాండ్ ఆవరణలో ఆకతాయిల ఆగడాలు రోజురోజు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రి సమయంలో బస్టాండ్ పైనున్న డూమ్ లైట్లు లేకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా బస్టాండ్ ఆవరణలో ఉన్న షాపుల నుంచి వేలాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామ ప్రజలు తీవ్రంగా మండి పడుతున్నారు. తాగడానికి నీరు లేక కూర్చోవడానికి కుర్చీలు మౌలిక సదుపాయాలు లేక పోవడంతో ప్రైవేట్ వాహనాల్లో తమ గ వ్య స్థా నా ల న ం చేరుకుంటున్నారు. బస్టాండ్ ఆవరణంలోనే రావాలంటేనే ప్రయాణీకులు జంకుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫోటో రైట్ అప్01: పెచ్చులూడిన ఆర్‌టిసి బస్టాండ్ ముందు భాగం

'ఉపాధి' యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - మద్దికేర

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, 2025 పేరుతో తీసుకువచ్చిన కొత్త బిల్లును తక్షణమే రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు ఆదివారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్త బిల్లు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కాకుండా ఉన్న ఉపాధినే హరించేదిగా ఉందన్నారు. పని దినాలు పెంచుతున్నట్లు చెప్పి వాస్తవంగా పని దినాలపై పరిమితులు విధిస్తున్నారని విమర్శించారు. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచకుండా పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారన్నారు.

టిడిపి కార్యకర్త మృతి

- కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త ఎం హమాలి రాజు(40) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్రెడ్డి, టిడిపి పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ ఆదివారం మృతుని స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ గట్టు అల్తాఫ్ ద్వారా మృతుని కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కోపరేటివ్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరికోట షాలేము, టిడిపి యువత కళ్యాణ్, ఎస్ విల్సన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- వైద్యులు హేమంత్ కుమార్

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరనికి విశేష స్పందన లభించింది. ఎమ్మిగనూర్ ఆర్కే కంటి వైద్యశాల డాక్టర్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నాగలదిన్నె గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించి వారి ఆరోగ్య అభివృద్ధికి తమ వంతు సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. నాగలదిన్నె గ్రామం, చుట్టపక్కల గ్రామాల ప్రజలు 200 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారన్నారు. వారికి కంటి సంబంధిత పరీక్షల నిర్వహించగా 66 మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. స్థానిక ఆర్ఎంపిలు, పిఎంపి ప్రాక్టీషనర్లు మాకు తమ వంతు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కే హాస్పిటల్ పిఆర్ఒ ఆనందరావు, సిబ్బంది, సర్పంచి తిమ్మప్ప, మాజీ సర్పంచి ఈరన్న, టిడిపి నాయకులు జబ్బార్, గౌస్, మాజీ సర్పంచి ప్రభాకర్, శేషాద్రి తిమ్మప్ప, రవిగౌడ్, షఫీ, మన్నన్ సాబ్, డబ్బా మల్లేష్, వీరారెడ్డి, తేజ, నాగరాజ్, సూరి గౌడ్, వీరేష్, హనీఫ్ పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్‌ను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కదిరికోట షాలేము మాట్లాడుతూ.. చంద్రశేఖర్ నివాసంలో తెలుగుదేశం కర్నూల్ పార్లమెంటు ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న భాస్కర్ల చంద్రశేఖరన్నని శాలువా పూలమాలలతో సత్కరించడం అభినందనీయమన్నారు. పార్టీ కష్టకాలంలో, మా ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్ రెడ్డికి అండగా నిలిచారన్నారు. చంద్రశేఖర్‌ను ఎన్నుకోవడం పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ బాబుకు, ఎమ్మెల్యే బీవీకి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు మారెప్ప, సురేష్, చిన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కదిరికోట షాలేము